ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 11 నవంబరు 2024



విదేశీ భాషలు.. స్వదేశీ కొలువులు

ఏయూలో గత కొన్నాళ్లుగా పలు విదేశీ భాషల కోర్సులు నిర్వహణ

- కనీస అర్హత ఇంటర్
- ఆరు నెలలు పాటు బోధన
- రూ. 10 వేలు ఫీజు.. వారానికి మూడు రోజులు తరగతులు
- మెరుగైన ఉద్యోగ,ఉపాధి అవకాశాలు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

- 8లో

అధునాతనంగా అనకాపల్లి రైల్వే స్టేషన్

ఆరు నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ సీఎం రమేశ్. పక్కన పీలా గోవింద సత్యనారాయణ, బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మళ్ల సురేంద్ర తదితరులు

- రైతుల కాలినడక వంతెన పునఃప్రారంభం
- లక్ష్మీదేవిపేట ఫ్లైఓవర్ వంతెన పూర్తికాకపోవడానికి జగన్ నిర్వాకమే కారణం
- జిల్లాలోని అన్ని రైల్వే స్టేషన్లలో మినరల్ వాటర్ ప్లాంట్లు
- పార్లమెంటరీ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్
- రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలన

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆరు నెలల్లో పూర్తిచేయాలని స్థానిక ఎంపీ, పార్లమెంటరీ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్ అధికారులను ఆదేశించారు. ఆయన అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, వికసిత్ భారత్‌లో భాగంగా రైల్వేస్టేషన్‌లను అధునాతనంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రధాన ముఖద్వారంతోపాటు రెండో ముఖద్వారం కూడా అభివృద్ధి చేస్తామన్నారు. రెండు రోజుల్లో అధికారులతో సమీక్ష నిర్వహించి, అన్ని అభివృద్ధి పనులను ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక రైతులు గతంలో ఉపయోగించే కాలినడక వంతెనను తక్షణమే పునఃప్రారంభించేలా అధికారులను ఆదేశిస్తామన్నారు. కొంతమంది వ్యక్తులు వంతెనపై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిసిందని, వీటిని అరికట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్‌లను అభివృద్ధి చేస్తామని, ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తామని సీఎం రమేశ్ తెలిపారు. రైళ్లలో ప్రయాణించే జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రయాణికుల వివరాలను రిజర్వేషన్ బుకింగ్ ద్వారా తెలుసుకుని, కొన్ని రైళ్లకు ఆయా స్టేషన్లను హాల్ట్‌లు కల్పిస్తామని ఆయన చెప్పారు. అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో పార్శిల్ కార్యాలయం మూసివేత విషయాన్ని జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లామని, గతంలో మాదిరిగా కొనసాగించేలా నిర్ణయం తీసుకోవాలని తెలియజేశామన్నారు. లక్ష్మీదేవిపేట ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు పూర్తికాకపోవడానికి గత సీఎం వైఎస్ జగన్ కారణమని ఆయన ఆరోపించారు. భూసేకరణ నష్టపరిహారం కోసం గత టీడీపీ ప్రభుత్వం డిపాజిట్ చేసిన రూ.ఏడున్నర కోట్లును వైసీపీ ప్రభుత్వం వెనక్కు తీసుకుందని విమర్శించారు. ఆ సొమ్మును త్వరలో డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకుంటామని సీఎం రమేశ్ పేర్కొన్నారు. అనంతరం అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీనియర్ ... మిగతా 8వ పేజీలో

గృహనిర్మాణ శాఖ నిర్వీర్యం

ఐదేళ్ల వైసీపీ పాలనలో అస్తవ్యస్తం



కోటవురట్ల జగనన్న కాలనీలో అసంపూర్తిగా వున్న ఇళ్ల నిర్మాణాలు (ఫైల్ ఫొటో)

- డీఈల నుంచి వర్క్ఇన్‌స్పెక్టర్ల వరకు పలు పోస్టులు ఖాళీ
- అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఇన్‌చార్జి ఏఈలుగా బాధ్యతలు
- అయినా పలు మండలాల్లో కొరత
- వచ్చే మార్చిలోగా ఇళ్ల నిర్మాణం పూర్తికి ప్రభుత్వం ఆదేశాలు
- అధికారులు, సిబ్బంది కొరతతో సతమతం
- పలు మండలాల్లో కార్యాలయాలకు వసతిలేమి

చోడవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో గృహ నిర్మాణ శాఖకు అధికారులు, సిబ్బంది కొరత తీవ్రంగా వుంది. దీంతో ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. జిల్లాలో ఏడు మండలాల్లో మాత్రమే రెగ్యులర్ ఏఈలు వున్నారు. కొన్ని మండలాల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఇన్‌చార్జి ఏఈలుగా కొనసాగు తున్నారు. ఏడు మండలాలకు ఏఈలు లేని పరిస్థితి నెలకొంది. డీఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కూడా పూర్తిస్థాయిలో లేరు. ఇక అందరికీ ఇళ్లు కట్టించి ఇచ్చే గృహ నిర్మాణ శాఖకు సొంత గూడు లేని పరిస్థితి నెలకొంది.**

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు గృహ నిర్మాణ శాఖను నిర్వీర్యం చేసింది. గృహ నిర్మాణ శాఖను పటిష్టం చేయకుండా, సిబ్బందిని నియమించకుండా ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నడిపిస్తూ, ప్రతి పనికీ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఆధారపడే దుస్థితికి దిగజార్చింది. చివరకు గృహ నిర్మాణ శాఖను గుర్తింపులేని శాఖగా కుదేలుని చేసింది. దీంతో పేదల ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణ కొరవడి గృహ నిర్మాణం పూర్తిగా మందగించింది. ఇటువంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, గృహ నిర్మాణ అభివృద్ధి సంస్థకు ప్రత్యేకంగా చైర్మన్‌ను నియమించడంతోపాటు, అసంపూర్తిగా వున్న ఇళ్లను వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే జిల్లాలోని గృహ నిర్మాణ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. చాలా మండలాల్లో రెగ్యులర్ ఏఈలు, రెగ్యులర్ వర్క్ఇన్‌స్పెక్టర్లు పూర్తిస్థాయిలో లేరు. గృహ నిర్మాణాలను పర్యవేక్షించే డీఈలు కూడా తగినంత మంది లేరు.



నరసయ్యపేటలోని పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్న చోడవరం గృహ నిర్మాణ శాఖ ఏఈ కార్యాలయం

జిల్లాలో గృహ నిర్మాణ శాఖకు నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి, అనకాపల్లి, చోడవరం, మాడుగుల, పెందుర్తి సబ్ డివిజన్లు ఉన్నాయి. ప్రతి సబ్‌డివిజన్‌కు రెగ్యులర్ డీఈతోపాటు, రెగ్యులర్ ఏఈలు, ఇద్దరేసి రెగ్యులర్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు వుండాలి. అయితే రెగ్యులర్ ఏఈలు లేకపోవడంతో, అవుట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లలో డిప్లొమా అర్హత ఉన్నవారికి మండల ఇన్‌చార్జి ఏఈగా అర్హత ఇచ్చి కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో చోడవరం, అనకాపల్లి అర్బన్, సబ్బవరం, పరవాడ, ఎలమంచిలి అర్బన్, నర్సీపట్నం అర్బన్, నాతవరం మండలాల్లో మాత్రమే రెగ్యులర్ ఏఈలు ఉన్నారు. మిగిలిన వారంతా ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇన్‌చార్జి ఏఈలుగా కొనసాగుతున్నారు. అయినప్పటికీ జిల్లాలోని ఏడు మండలాల్లో ఏఈ పోస్టులు కొరత నెలకొంది. మాకవరపాలెం, అచ్యుతాపురం, ఎలమంచిలితోపాటు, ఈ నెలాఖరుకు నర్సీపట్నం రూరల్ పోస్టు కూడా ఖాళీ కానుంది. ఇటువంటి మండలాలకు పక్క మండలాల ఏఈలను ఇన్‌చార్జిలుగా నియమించారు. ఉదాహరణకు చోడవరం ఏఈకి మాకవరపాలెం ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు కేంద్రాల మధ్య దూరం సుమారు 50 కిలోమీటర్లు వుంటుంది. దీంతో రెండుచోట్లా పనుల పర్యవేక్షణ ఇబ్బందికరంగా మారింది.

గృహనిర్మాణ శాఖ సబ్ డివిజన్లలో పూర్తిస్థాయిలో డీఈలు లేరు. ఎలమంచిలిలో డీఈ పోస్టు ఖాళీగా వుండడంతో పాయకరావుపేట డీఈని ఇన్‌చార్జిగా నియమించారు. మాడుగుల డీఈ గత నెలలో పదవీ విరమణ చేయడంతో చోడవరం డీఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక చోడవరం డీఈ కూడా వచ్చే నెలలో రిటైర్ కానున్నారు. అప్పుడు మాడుగుల, చోడవరం సబ్‌డివిజన్లకు ఎవరిని ఇన్‌చార్జిలుగా నియమిస్తారో వేచిచూడాలి! మొత్తం ఏడు సబ్ డివిజన్లలో మూడు డీఈ పోస్టులు ఖాళీ కావడంతో మిగిలిన డీఈలపై భారం పడనుంది.

జిల్లాలో ప్రతి మండలానికి ఇద్దరేసి రెగ్యులర్ వర్క్ఇన్‌స్పెక్టర్లు వుండాలి. కానీ జిల్లాలో రెగ్యులర్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు మాత్రమే వున్నారు. మిగిలిన వారంతా అవుట్ సోర్సింగ్ సిబ్బందే! పలుచ మండలాల్లో తగినంత మంది ... మిగతా 8వ పేజీలో

హాకీ విజేతలు విశాఖ, కడప

నక్కపల్లిలో ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

- జాతీయ పోటీలకు బాలురు, బాలికల జట్లు ఎంపిక

- వార్త 8వ పేజీలో



రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో విజేతగా నిలిచిన విశాఖ బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

వేడి సాంబరులో బాలిక!

తీవ్రగాయాలతో ఆస్పత్రికి తరలింపు

- ప్రాథమిక చికిత్స చేయించి తల్లిదండ్రులకు అప్పగించిన సిబ్బంది
- గోప్యంగా ఉంచిన ప్రిన్సిపాల్
- మరో ఆస్పత్రిలో రూ.లక్ష ఖర్చు చేసి చికిత్స చేయిస్తున్న తల్లిదండ్రులు
- ఆస్పత్రి నుంచి సమాచారం వచ్చినా.. కేసు నమోదు చేయని పోలీసులు

అచ్యుతాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తూ వేడి సాంబరులో పడిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం విశాఖ తరలించారు. శనివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనను హాస్టల్ నిర్వాహకులు గోప్యంగా వుంచారు. విద్యార్థిని తల్లిదండ్రుల ద్వారా ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది.

అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం కె.సంతపాలెం గ్రామానికి చెందిన రొంగలి యశశ్విని అచ్యుతాపురంలోని గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నది. శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో హాస్టల్‌లోని వంటశాలకు వెళ్లింది. ప్రమాదవశాత్తూ అక్కడ వేడి సాంబరు వున్న పెద్ద గిన్నెలో పడిపోయింది. వెంటనే అప్రమత్తమైన హాస్టల్ సిబ్బంది.. ఆ బాలికను బయటకు తీశారు. సాంబరు వేడిగా వుండడంతో 50 శాతం శరీరం కాలిపోయింది. దీంతో గురుకుల పాఠశాల సిబ్బంది వెంటనే విశాఖ తీసుకెళ్లి ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ప్రాథమిక చికిత్స చేయించి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్, సిబ్బంది బయటకు పొక్కనివ్వలేదు. కానీ బాలికకు చికిత్స చేస్తున్న ఆస్పత్రి నుంచి పోలీసులకు సమాచారం వచ్చింది. అయినప్పటికీ పోలీసులు సైతం కేసు నమోదు చేయలేదు.. మీడియాకు వివరాలు వెల్లడించలేదు. వ్యవసాయ కూలీ అయిన బాలిక తండ్రి శ్రీరామమూర్తి మరో ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు సుమారు లక్ష రూపాయలు ఖర్చు అయినట్టు ఆయన చెబుతున్నారు. పాఠశాల సిబ్బంది, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లే తన కుమార్తెకు ప్రమాదం జరిగిందని ఆయన ఆరోపిస్తున్నారు. ఆదివారం ఇక్కడకు వచ్చిన బాలిక తల్లిదండ్రులు.. గురుకుల పాఠశాల సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతులు జరిగే సమయంలో తమ కుమార్తె వంటశాలలోకి ఎందుకు వెళ్లిందో ప్రిన్సిపాల్, సిబ్బంది వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్, సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేసి, చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రతి పనికీ ఓ రేటు!

మామూళ్ల ఇవ్వనిదే కదలని దరఖాస్తు

- మాకవరపాలెం 'రెవెన్యూ'లో ఊడలు దిగిన అవినీతి
- ధ్రువీకరణ పత్రాల నుంచి భూముల మ్యుటేషన్ వరకు లంచాలు వసూళ్లు
- ప్రభుత్వం మారినా.. ఇక్కడే పాతుకుపోయిన సిబ్బంది

మాకవరపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): **మండల రెవెన్యూ కార్యాలయంలో ఏ పనికైనా మామూళ్లు ఇచ్చుకోవాల్సిందేనన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. 'ఫార్మాలిటీస్' పేరుతో ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్నిరకాల 'పెద్ద పనులు' అయితే కింది నుంచి పైవరకు స్థాయికి తగ్గట్టు ముడుపులు సమర్పించుకోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు. అయినా సరే పనులు సత్వరమే చేయడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

మాకవరపాలెం రెవెన్యూ కార్యాలయంలో కుల, ఆదాయ, జనన,మరణ ధ్రువపత్రాలు, భూముల మ్యుటేషన్, పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ, ఫ్యామిలీ సర్టిఫికెట్లు మంజూరు.. ఇలా ఏ పనికైనా సరే డబ్బులు ఇస్తేనే జరుగుతుందని అన్న ప్రచారం జరుగుతోంది. గత శుక్రవారం భూమి మ్యుటేషన్‌కు తామరం వీఆర్వో రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడడం ఇందుకు ఒక ఉదాహరణ మాత్రమే. వైసీపీ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ శాఖలో అవినీతి వేళ్లూనికునిపోయింది. ఇక మాకవరపాలెం మండలంలో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు. అప్పుడున్న సిబ్బందిలో అత్యధికులు ఇప్పుడు కూడా ఇదే మండలంలో కొనసాగుతుండడంపై ప్రజలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో పనిచేసిన కొందరు వీఆర్‌వోలు, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇదే మండలంలో వేరే గ్రామాలకు బదిలీ చేయించుకుని ఇక్కడే పాతుకుపోవడం విశేషం.



మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయం

ఓబీసీ సర్టిఫికెట్ కావాలంటే రూ.1,000 నుంచి రూ.1,500, ఫ్యామిలీ సర్టిఫికెట్ అయితే రూ.2 వేల నుంచి రూ.3 వేలు తీసుకుంటున్నారు.

సొంత శాఖకు చెందిన సహచర ఉద్యోగుల నుంచి కూడా మామూళ్లు తీసుకుంటున్నారంటేన పరిస్థితి ఎంత దారుణంగా వుందో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కోటవురట్ల మండలం రాజుపేట వీఆర్‌వో బాధ్యతలు నిర్వహిస్తూ వైసీపీ హయాంలో మృతిచెందారు. కుటుంబ సభ్యులు ఫ్యామిలీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేస్తే.. నిర్మొహమాటంగా రూ.3 వేలు వసూలు చేశారట!

కొత్తగా భూములు కొనుగోలు చేసినా, లేకపోతే వారసత్వంగా వచ్చిన భూమికి సంబంధించి పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు (ముటేషన్) చేయాలన్నా, పట్టాదారు పాస్ ... మిగతా 8వ పేజీలో

మధ్యాహ్న భోజనానికి సరికొత్త మెనూ!


వారంలో నాలుగు రోజులు అన్నం, ఆకుకూర పప్పు, కూర, సాంబారు, రసం


- ఒక రోజు వెజ్ పలావ్, పులిహోర
- రూపొందించిన పాఠశాల విద్యాశాఖ
- త్వరలో పాఠశాలల్లో అమలుకు కసరత్తు
- రసం బదులు పప్పు మేలంటున్న ఉపాధ్యాయులు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతి రోజూ మధ్యాహ్నం అందించే భోజనంలో మార్పులు జరగనున్నాయి. రాష్ట్రంలోని ప్రాంతాల వారీగా ప్రజల అలవాట్లను పరిగణనలో తీసుకున్న ప్రభుత్వం కొత్తమెనూను రూపొందించింది. ఉత్తరాంధ్ర ప్రజల అలవాట్ల మేరకు వారానికి నాలుగు రోజులు వైట్ రైస్‌తో కూడిన భోజనం అందిస్తారు. సోమవారం వైట్‌రైస్, తోటకూరపప్పు, ఉడకబెట్టిన గుడ్డు, శనగపప్పు చిక్కీ మంగళవారం వైట్ రైస్, గుడ్డు కూర, రసం, రాగి జావ, బుధవారం వెజ్ పలావ్, బంగాళదుంపల కుర్మా, ఉడకబెట్టిన గుడ్డు, శనగపప్పు చిక్కీ గురువారం వైట్‌రైస్, సాంబారు, గుడ్డుకూర, రాగి జావ, శుక్రవారం చింతపండుతో పులిహోర, వెజిటెబుల్స్/గోంగూర చట్నీ, ఉడకబెట్టిన గుడ్డు, శనగపప్పు చిక్కీ శనివారం వైట్ రైస్, వెజిటబుల్ కర్రీ, రసం, రాగి జావ, స్వీట్ పొంగల్ ఇవ్వాలని ప్రతిపాదించారు.**

గత ప్రభుత్వంలో విద్యార్థులకు ఇష్టం లేకపోయినా కిచిడీ, బిర్యానీ, పొంగల్ వంటి వాటితో అందించే భోజనం తినేందుకు ఎక్కువమంది ఇష్టపడేవారు కాదు. అలవాటులేని భోజనం కావడంతో విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారియర్ తెచ్చుకునేవారు. దీనిపై అభ్యంతరాలు వచ్చినా పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులను గుర్తించింది. దీనిపై మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకుని మెనూ మార్చాలని నిర్ణయించారు. ప్రాంతాలవారీగా ప్రజల భోజన అలవాట్లను తెలుసుకుని, విద్యార్థులు ఇష్టపడి తినేలా మెనూ రూపొందించేందుకు ప్రాంతాల వారీగా వంట ఏజెన్సీలతో ఇటీవల విజయవాడలో సమావేశం నిర్వహించారు. ఇందులో ఉత్తరాంధ్ర ప్రజలు ఎక్కువగా ... మిగతా 8వ పేజీలో







కొత్తగా అమలులోకి రానున్న మధ్యాహ్న భోజనం మెనూ

విద్యలో రాణించి ఉపాధి పొందాలి

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యలో రాణించి విద్యార్థులు ఉపాధి పొందాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. క్రైట్స్ విద్యా సంస్థ వార్షికోత్సవం, ఫ్రెషర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశ్రామికంగా అచ్యుతాపురం బాగా అభివృద్ధి చెందుతోందన్నారు. రానున్న ఐదేళ్లలో భారీ స్థాయిలో కర్మాగారాలు రానున్నాయన్నారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో విద్యపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, నాయకులు కూండ్రపు వెంకునాయుడు, ద్వారపురెడ్డి బాపూజీ, డ్రీమ్స్ నాయుడు, రెడ్డి అప్పలనాయుడు, రెడ్డి గణేష్, ఆడిగర్ల శంకరరావు, విల్లూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

▸▸ 600 మందికి పరీక్షలు.. ▸▸ 25 మంది రక్తదానం



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న దొరస్వామి

అచ్యుతాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 132వ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి 600 మంది కంటి రోగులు రాగా 487 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 354 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 93 మందికి ఉచితంగా మందులు ఇచ్చారు. 40 మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు చేయించాలని వైద్య బృందం నిర్ణయించింది. వీరికి విశాఖలో గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా చికిత్సలు చేయిస్తామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. అలాగే బ్రాండిక్స్, రెడ్‌క్రాస్ స్వచ్ఛందంగా నిర్వహించిన శిబిరంలో 25 మంది ఉచితంగా రక్తదానం చేశారు.

రేవుపోలవరంలో పర్యాటకుల సందడి



రేవుపోలవరం సముద్రతీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

ఎస్.రాయవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సముద్ర తీరంలో జలకాలాడిన పర్యాటకులు తరువాత వనభోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆ ప్రాంతంలో ఆటపాటలతో గడిపారు. సముద్రతీరంలో స్నానాలు చేసే సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు.

రోడ్డుకు అదనపు స్థలం ఇవ్వలేం

▸▸ సెజ్ రోడ్డు ఇంటి యజమానుల సంఘం సభ్యులు తీర్మానం



సమావేశమైన సెజ్ రోడ్డు ఇంటి యజమానుల సంఘం సభ్యులు

అచ్యుతాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం నుంచి సెజ్ రోడ్డుకు అదనపు స్థలాలు ఇచ్చేది లేదని సెజ్ రోడ్డు ఇంటి యజమానుల సంఘం సభ్యులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ఒక ప్రైవేటు కాలేజీ ఆవరణలో జరిగిన సమావేశంలో సంఘం సభ్యులు కొన్ని తీర్మానాలు చేశారు. అచ్యుతాపురం నుంచి పూడిమడక రోడ్డు మరోసారి విస్తరణకు 15 అడుగుల మేర భూసేకరణ చేయాలని అధికారులు నిర్ణయించారని, దీనివల్ల 140 కుటుంబాలకు చెందిన గృహాలు పూర్తిగా కోల్పోతామన్నారు. ఎంత పరిహారం ఇచ్చినా అటువంటి స్థలాన్ని పొందలేమన్నారు. తామంతా ఫ్లైఓవర్‌ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రతి రోజూ ఎవరో ఒకరు వచ్చి ఇంటి గోడలపై ఎరుపు గీతలు గీస్తున్నారని, కుటుంబ సభ్యులంతా భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఇకపై తమ అనుమతి లేకుండా గీతలు గీస్తే సహించేది లేదని వీరు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పల్లి శేషగిరిరావు, దేశంశెట్టి అప్పలనాయుడు, బాలాజీ, శ్రీధర్, రొంగలి సత్యనారాయణ, కుమార్, కాసుబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రగడ, పప్పలను సత్కరించిన బుద్ద



ప్రగడ, పప్పల చలపతిరావులను సత్కరిస్తున్న బుద్ద నాగజగదీష్

ఎలమంచిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావులను ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీష్ ఘనంగా సత్కరించారు. అంతకుముందు పట్టణంలోని తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారిని ప్రగడ, బుద్ద తదితర నేతలంతా కలిసి దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులంతా కలిసి నేతలకు ఘనంగా ఆహ్వానం పలికి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, కొఠారు సాంబ, రాజాన సూర్యనాగేశ్వరరావు, బొద్దపు నాగేశ్వరరావు, ఆడారి ఆదిమూర్తి, కరణం రవి, నానేపల్లి సుబ్బయ్యనాయుడు, రమణబాబు, గొర్లె బాబూరావు పాల్గొన్నారు.

ఎలమంచిలి రోడ్లపై కుక్కలు, కోతుల బీభత్సం

▸▸ మిలట్రీ కాలనీ, కొత్తపేట కాలనీల్లో రెండు గంటలు పరస్పర దాడులు

▸▸ రోడ్లపై వెళ్లిన వారిపై దాడి చేసిన వానరాలు

▸▸ బయటకు వచ్చేందుకు భీతిల్లిన జనం

▸▸ ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటూ గడిపిన పట్టణవాసులు



కొత్తపేట ప్రధాన రోడ్డుపై కుక్కలు, కోతులు స్వైరవిహారం

ఎలమంచిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రోడ్లపై కుక్కలు, వానరాల సమూహం ఆదివారం ఉదయం గంటల తరబడి రోడ్లపై స్వైరవిహారం చేశాయి. కుక్కలు, కోతులు రెండు గంటలపాటు రోడ్లపై దాడి చేసుకున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడ్డారు. వివరాల్లోకి వెళితే..

పట్టణంలోని మిలట్రీ కాలనీ, కొత్తపేట కాలనీ ప్రధాన రోడ్డుపై ఆదివారం తెల్లవారుజాము 5 గంటల నుంచి 7 గంటల వరకూ కోతులు, కుక్కలు దాడి చేసుకున్నాయి. ఈ సమయంలో రోడ్డు మీద రాకపోకలు సాగించే వారిపై వానర మూక తమ ప్రతాపాన్ని చూపాయి. దీంతో రోడ్డుపై ప్రయాణించే వారంతా పరుగులు తీసి తప్పించుకున్నారు. మరి కొంతమంది బిక్కుబిక్కుమంటూ ఇళ్లల్లోనే ఉండిపోయారు. ఇటీవల పట్టణంలో వానరాల దాడులు తీవ్రరూపం దాల్చుతుండడంతో ప్రజలు రోడ్లపై నడవలేని పరిస్థితి ఎదురవుతుంది. ఇళ్ల ముందు కూడా రోజువారీ పనులు కూడా చేసుకోలేని పరిస్థితి నెలకొంది. కోతుల సంఖ్య పెరిగిపోవడంతోపాటు ప్రజలపై దాడులకు దిగుతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా మిలట్రీ కాలనీ, కొత్తపేట, నాగేంద్రకాలనీ, రామ్‌నగర్, ఏఎస్ఆర్ కాలనీ ప్రాంతాల్లో కోతుల తీవ్రత అధికంగా ఉంది. కోతులను పట్టి అటవీప్రాంతాలకు తరలించేందుకు మునిసిపల్ పాలక వర్గం ఇటీవల కౌన్సిల్ సమావేశంలో తీర్మానించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి మునిసిపల్ అధికారులు చొరవ తీసుకుని కోతుల బారి నుంచి పట్టణవాసులను కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ దిశగా మునిసిపల్ చైర్‌పర్సన్, శాసనసభ్యులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పూర్తయిన తాగునీటి పైపులైన్ పనులు

▸▸ నేటి నుంచి పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా



యర్రవరం సంప్‌ను పరిశుభ్రం చేస్తున్న సిబ్బంది

ఎలమంచిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపురం వద్ద పట్టణానికి తాగునీటి సరఫరా చేసే ప్రధాన పైపులైన్ మరమ్మతు పనులు ఆదివారం పూర్తయ్యాయి. సోమవారం ఉదయం నుంచి మునిసిపాలిటీతోపాటు మండలంలోని గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా జరుగుతుందని మునిసిపల్ అధికారులు తెలిపారు. పైపులైన్ మరమ్మతుకు గురవ్వడంతో మునిసిపాలిటీతోపాటు మండలంలోని 17 గ్రామాలకు 3 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది పైపులైన్ మరమ్మతు పనులు ఆదివారం నాటికి పూర్తి చేశారు. సోమవారం నుంచి అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మునిసిపాలిటీకి తాగునీటి సరఫరా చేసే యర్రవరంలోని 200 వేల కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన సంప్‌ను మునిసిపల్ ఏఈ గణపతిరావు పర్యవేక్షణలో సిబ్బందిచే పరిశుభ్రం చేశారు. సోమవారం నుంచి తాగునీటి సరఫరా జరుగుతుందని ఏఈ గణపతిరావు తెలిపారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు : ప్రగడ



అచ్యుతాపురం: ప్రగడ నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుందరపు



ఎలమంచిలి: ఏటికొప్పాక బండిమాంబని దర్శించుకుంటున్న ప్రగడ

అచ్యుతాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో రోడ్లు ఛిద్రమయ్యాయని, రోడ్లు అభివృద్ధి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు వస్తానని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పదవి పొందిన ప్రగడ నాగేశ్వరరావును ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం ప్రగడ మాట్లాడుతూ తనకు కార్పొరేషన్ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఎలమంచిలి నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే సుందరపుతో కలిసి రోడ్లు అభివృద్ధి చేస్తామన్నారు. సీనియర్ టీడీపీ నాయకులు పప్పల చలపతిరావు ఆదేశాలు తప్పక పాటించి రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏటికొప్పాక బండిమాంబని దర్శించుకున్న ప్రగడ

ఎలమంచిలి: రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆదివారం ఉదయం ఏటికొప్పాకలోని బండిమాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ప్రగడ నాగేశ్వరరావును టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కాండ్రకోట చిరంజీవి, మాజీ వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరరావు(శేషు), ఇత్తంశెట్టి రాజు తదితరులు పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏటికొప్పాకలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పూడి రామకృష్ణ, రాయి కృష్ణ, వేవరపు మోహన్, కె. సింహాచలం పాల్గొన్నారు.

పప్పలను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రగడ

రాంబిల్లి: రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆదివారం మండలంలోని దిమిలిలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పప్పల చలపతిరావును ప్రగడ నాగేశ్వరరావు సత్కరించారు. ప్రగడను సత్కరించి చలపతిరావు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీఎంపీ చలపతిరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రగడ నాగేశ్వరరావుకు మంచి పదవిని ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావును టీడీపీ మండల నాయకులు ఘనంగా సత్కరించారు. అచ్యుతాపురంలోని టీడీపీ కార్యాలయంలో ప్రగడను కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్షుడు, ఎరిపిల్లి అజయ్, నాయకులు ఎరిపిల్లి చిట్టిబాబు, చెల్లూరి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



ఎలమంచిలి: ప్రగడకు పూలమాల వేస్తున్న ఏటికొప్పాక నేతలు



రాంబిల్లి: ప్రగడను సత్కరించిన తెలుగు యువత నేత అజయ్, తదితరులు

నీటి సంఘాల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలి

▸▸ టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు



పార్టీ నేతలతో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షులు పి.చిట్టిబాబు

పాయకరావుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో పోటీ చేసే అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులు కృషిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలంలో జరగనున్న ఏడు సాగు నీటి సంఘాలకు పోటీ చేసే అభ్యర్థుల విషయమై పార్టీ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, మార్పులు, చేర్పులను అధికారులకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా మండలంలో సాగునీటి వనరుల అభివృద్ధికి కృషి చేసేవారిని మాత్రమే పార్టీ తరపున పోటీలో నిలబెట్టే అవకాశం ఉన్నందున అటువంటి వారిని గుర్తించి తెలియజేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గణపర్తి రాజబాబు, దొరబాబు, చిక్కాల శ్రీను, చించెలపు పద్దు, కీర్తి సీతారాం, కట్టా శ్రీను, ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాలెం వద్ద మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్, ఎస్ఐ ఉపేంద్ర

ఎలమంచిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపాలెం జంక్షన్ సమీపంలోని పెట్రోలు బంకు వద్ద హైవే పక్కన మృతదేహాన్ని రూరల్ పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర అందించిన వివరాలిలా ఉన్నాయి.

జాతీయ రహదారి పక్కన ఆదివారం ఉదయం వ్యక్తి మృతదేహాన్ని చూసిన స్థానికులు వీఆర్వోకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఆయన ఆ సమాచారాన్ని పోలీసుకు తెలిపారు. దీంతో ఎస్ఐ, సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్ నిపుణులతో కలిసి పరిశీలించారు. మృతదేహంపై ఎటువంటి గాయాలు లేవని, బాగా డీకంపోజ్ అయిపోవడంతో దుర్వాసన వస్తున్నదని ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. మృతి చెంది రెండు, మూడు రోజులు అయి ఉండవచ్చునన్నారు. ఈనెల 6వ తేదీన సీసాలు లోడు లారీతో అనకాపల్లి వెళ్లి అన్‌లోడ్ చేసి ఈనెల 7వ తేదీన పోతిరెడ్డిపాలెం పెట్రోలు బంకు సమీపంలో లారీ నిలిపివేసి ఉంది. అయితే యజమాని మనుషులు వచ్చి లారీని తీసుకు వెళ్లిపోయినట్టు తెలిసిందని ఎస్ఐ తెలిపారు. తర్వాత ఇతను రోడ్డు పక్కన మృతి చెంది ఉన్నాడని, మృతుడి శరీరంపై ఎటువంటి గాయాలు లేవని, క్లూస్‌టీమ్ నివేదికలో వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని ఎలమంచిలి మార్చురీకి తరలించామని, పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సీపీఎం మండల కన్వీనర్‌గా రొంగలి



అచ్యుతాపురం, నవంబరు 10: సీపీఎం మండల కన్వీనర్‌గా రొంగలి రాము ఎంపికయ్యారు. ఆదివారం ఇక్కడ జరిగిన మండల మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా కర్రి అప్పారావు, కూండ్రపు సోమునాయుడు, వి.రామ్‌కుమార్, ఎస్.రామునాయుడు, చేపల తాతలు, జయలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రొంగలి రాము మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు పెరిగిన ధరలపై నిరసన చేస్తామన్నారు. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు శరగడం రామసదాశివరావు, చోడిపల్లి అప్పారావు, నాయుడు, దేవుడమ్మ, ప్రశాంత్, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

అమలాపురంలో గ్రావెల్ ట్రాక్టర్ పట్టివేత

నక్కపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురంలో ఆదివారం గ్రావెల్ ట్రాక్టరు పట్టుకున్నామని సీఐ కుమారస్వామి చెప్పారు. తమకు వచ్చిన సమాచారం మేరకు ఎటువంటి అనుమతుల్లేకుండా అక్రమంగా గ్రావెల్‌ను ట్రాక్టర్‌పై తరలిస్తుండగా పట్టుకుని, తదుపరి చర్యలు నిమిత్తం రెవెన్యూ, మైన్స్ అధికారులకు సమాచారమిచ్చామని చెప్పారు. ఎవరైనా గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా చేసినా, ఏపీఐఐసీ భూముల్లో అక్రమ తవ్వకాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైద్య శిబిరంలో 174 మందికి పరీక్షలు



తిమ్మాపురంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలో ఆదివారం శ్రీకుసుమ కావ్య ఫౌండేషన్ అధినేత సేనాపతి బాబూరావు ఆధ్వర్యంలో మహిళల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. విశాఖకు చెందిన మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్, కేర్ హాస్పటల్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 174 మంది స్త్రీలకు ఉచితంగా గైనిక్ స్క్రీనింగ్ పరీక్షలతోపాటు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. రోగులకు స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సుభద్ర, డాక్టర్ సాయిరాం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేనాపతి పరుశురాం, ఏ బుజ్జి, దమ్ము రాజు, ప్రసాదుల గణేష్, ఒ. అప్పారావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో పేలా స్థాపన



రామలింగేశ్వరస్వామి ఆలయంలో పేలా స్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఎలమంచిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి కొత్తపేటలో పునర్నిర్మాణం అయిన రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం వేదపండితుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో పేలా స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భగుడిలో స్వామివారి లింగం ప్రతిష్ఠించే స్థలంలో లోతుగా తవ్వి శాస్త్రోక్తంగా అందులో రాగి బిందెతో నాణేలు, అరలు గల పెట్టెలో నవరత్నాలు, బంగారం, వెండి, రాగి ఇత్తడి వంటి లోహాలు వేయు కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం ప్రజాపోరు వాల్‌పోస్టర్‌ను సీపీఎం మండల నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 15వ తేదీ వరకు ప్రజా సమస్యలపై ప్రచారం చేస్తామన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం,రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం కొత్తపట్నం, రాంబిల్లి, చినకలవలాపల్లి గ్రామాల్లో సీపీఎం కార్యకర్తలు ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎస్. నారాయణరావు, చందక రామకృష్ణ, ఎం.శ్రీనివాస్, అప్పారావు, గంగాధర్‌రావు, గంగరాజు, ఎస్.లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొన్నారు.

శిథిల స్థితిలో కల్వర్టు



సీతారాంపురంలోని శిథిల స్థితిలో ఉన్న కల్వర్టు

పాయకరావుపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం రోడ్డులో కల్వర్టు శిథిల స్థితికి చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ కల్వర్టును తొలగించి కొత్తది నిర్మించాలని కోరుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోయారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ కల్వర్టు పూర్తిగా శిథిల స్థితికి చేరుకుని ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు భయపడుతున్నారు. గ్రామంలోకి వెళ్లాలంటే ఈ కల్వర్టు మీదుగానే ప్రయాణించాలి. గతంలో జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి తారు రోడ్డు నిర్మించారు గానీ శిథిల స్థితిలో ఉన్న కల్వర్టును మాత్రం నిర్మించలేదని వారు తెలిపారు. కల్వర్టు కూలితే గ్రామంలోకి వెళ్లే మార్గం లేదని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

టీడీపీలో కష్టపడిన వారికి గుర్తింపు : పీలా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం తుమ్మపాలలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలంతా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా పార్టీ నిలుస్తుందని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిలో అంతా భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కర్రి బాబి, మత్తుర్తి మహేష్, పెతకంశెట్టి బలరాం, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్ అభివృద్ధి సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కొత్తూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరులోని ముత్రాసు కాలనీలో గల సాయినగర్ అభివృద్ధి సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ కేవీఎస్ ఈశ్వరరావు, అధ్యక్షులుగా డాక్టర్ డి.అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా గుత్తిగొండ గణేశ్వరరావు, జాన్, కార్యదర్శిగా వి.మురళీ, సహాయ కార్యదర్శిగా గండి రవికుమార్, ట్రెజరర్‌గా కె.శ్రీనివాసరావు, మహిళా విభాగం నేతగా డి.శాంతి, కార్యవర్గ సభ్యులుగా అప్పారావు, వెంకట్రావు, ఆదినారాయణరావు, తిరుపతిరావు, నరసింహారెడ్డి, కమల్ పటేల్, వి.మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాలనీ అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలని తీర్మానం చేసుకున్నారు.

'విద్యార్థుల సదస్సును విజయవంతం చేయండి'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ తదితరులు

తుమ్మపాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 'ఉత్తరాంధ్ర కరువు, వలసలు, విద్య, ఉపాధి రంగ సమస్యలు- కర్తవ్యాలు' అంశంపై ఈ నెల 15న విజయనగరంలో జరిగే ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును విద్యార్థులు, యువకులు, మేధావులు విజయవంతం చేయాలని పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ కోరారు. ఆదివారం ఇక్కడి ఎస్సీ హాస్టల్ వద్ద ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్రకు కేటాయించిన విశాఖ రైల్వే జోన్, సెంట్రల్ యూనివర్సిటీ, విద్యా సంస్థలకు నిధుల కేటాయింపు వంటి హామీలను అమలు చేయాలని, మూతపడ్డ జ్యూట్, చక్కెర తదితర వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తెరిపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే విరమించి సొంత గనులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరించిన ఎయిడెడ్ కళాశాలను ప్రభుత్వమే కొనసాగించాలని, ఉత్తరాంధ్రలో విచ్చలవిడిగా యువతకు అందుబాటులో ఉంటున్న గంజాయి, మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని, వలసలను అరికట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. వీటన్నింటిపై జరగనున్న సదస్సుకు అంతా హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా కమిటీ సభ్యులు కె.చందు, ఎస్.గణేష్, పి.ఉదయ్ కిరణ్, ఓ.మహేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

26న కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడ జరిగిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశం మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన మూడోసారి కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడానికి చర్యలు తీసుకోవడం లేదని, కార్పొరేట్ కంపెనీలకు కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ ప్రజలపై భారాలు వేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యుత్ భారాలు వేసిందన్నారు. ఈ సమస్యలపై ఆందోళన చేపట్టనున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు వీవీ శ్రీనివాసరావు, ఆర్. రాము, ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని గ్రామం

గొల్లగుంటలో సమస్యల ఘోష

- సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం
- కాలువలు లేక ఇబ్బందులు
- ఇళ్ల మధ్యే మురుగు తిష్ట

పరవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావాడ పంచాయతీ పరిధి గొల్లగుంట గ్రామం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇక్కడ సుమారు 80 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఈ గ్రామంలో సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పూర్తిస్థాయిలో మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టలేదు. దీని కారణంగా వాడుకనీరంతా ఇళ్ల మధ్యే నిలిచిపోతుంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది రాత్రుళ్లు కంటి పై కునుకు లేకుండా చేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి వనరుల వద్ద అపారిశుధ్యం తాండవిస్తుంది. దీంతో తరుచూ గ్రామస్థులు అనారోగ్యాల బారినపడుతున్నారు. కాలువల నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టాలని ఇటు అధికారులను, అటు ప్రజాప్రతినిధులను కోరినా ఫలితం లేకపోతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



గ్రామంలోని ఓ వీధి రోడ్డు మధ్య చేతిబోరు.. చుట్టూ మురుగు తిష్ట

ఎన్నికల సమయంలో గ్రామంలోకి వచ్చే నాయకులు గ్రామాన్ని అభి వృద్ధి చేస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి ఎన్నికల అనంతరం ముఖం చాటేస్తున్నారని ఇక్కడివారంతా మండిపడుతున్నారు. ఏళ్ల తరబడి అసౌకర్యాల మధ్య జీవనం సాగిస్తున్నామని వాపోతున్నారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని అంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.



కాలువ లేని బీటీ రోడ్డు



ఇళ్ల మధ్య దర్శనమిస్తున్న మురుగు

మా బాధలు ఎవరికీ పట్టడం లేదు



గ్రామంలో సమస్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారు. మా గోడును వారు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో గ్రామంలోకి వచ్చి హామీలు ఇస్తుంటారు. ఎన్నికల అనంతరం ముఖం చాటేస్తున్నారు. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. వసతులు కల్పించేందుకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి.

- పర్వానీ, గొల్లగుంట

తరచూ రోగాలబారిన పడుతున్నాం



గ్రామంలో పూర్తిస్థాయిలో కాలువలు లేకపోవడం వల్ల వాడుకనీరంతా ఇళ్ల మధ్యే నిల్వ ఉండిపోవడంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నాం. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొంది. వర్షా కాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. రోజుల తరబడి వర్షపునీరు ఇళ్ల మధ్యే నిలిచిపోతుండడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదువుతున్నాయి. అయినా పట్టించుకునేవారు లేరు.

- షేక్ బాదుషా, గొల్లగుంట

సమస్యలపై 104 ఉద్యోగుల ఆందోళన



నెహ్రూచౌక్‌లో ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 104 ఉద్యోగులు ఆదివారం పట్టణంలో ఆందోళన చేపట్టారు. తొలుత సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకు ప్రదర్శన నిర్వహించి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, 104 ఉద్యోగుల యూనియన్ గౌరవాధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ పేదలకు వైద్యసేవలందిస్తున్న ఈ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం తగదన్నారు. గత పదహారేళ్లగా ప్రజలకు ఉద్యోగులు సేవలందిస్తున్నారన్నారు. అరబిందో యాజమాన్యం జీవో నంబరు ఏడును అమలు చేయకుండా ఎరియర్స్, ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. 104 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.నాగసాయి, ఆర్.అప్పల రమణ, జి.చంద్రుడు, ఎస్.సూర్యకళ, భార్గవ, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవానిపాలెంలో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ రమేష్, ఎమ్మెల్యే పంచకర్ల తదితరులు

సబ్బవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అసకపల్లి శివారు ఎర్రవానిపాలెంలో శ్రీకృష్ణ ఆలయ ప్రారంభోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు జరిపారు. ఉదయం విగ్రహాన్ని పురోహితులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ మహా సభ జాతీయ ఉపాధ్యక్షులు భరణికాన రామారావు, ఆలయ ధర్మకర్త, జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు భరణికాన బాబూరావు, సర్పంచ్ కర్రి నర్శింగరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, అసకపల్లి, ఎరుకునాయుడు, నక్కవానిపాలెం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాస మహోత్సవం



సబ్బవరం, నవంబరు 10 : ఆరిపాక శివారు యాతపాలెం సమీపంలోని మణిపురంలో కొలువైన భువనేశ్వరీదేవి అమ్మవారి ఆదివాస మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంఖం పత్రితో అమ్మవారిని పూజించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నేటి నుంచి అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

పరవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లంకెలపాలెం జంక్షన్‌లో గల అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం సోమవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తొలి రోజు స్వామి వారికి అరుణపాసుపతా అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

బాబ్జీ, సురేంద్రలకు అభినందనల వెల్లువ



గండి బాబ్జీకి బొకేలు అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సబ్బవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్‌సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీకి ఆదివారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని మొగలిపురంలో గల అతని స్వగృహానికి సబ్బవరం నుంచి పలువురు టీడీపీ నేతలు వెళ్లి పుష్పగుచ్ఛాలను అందజేసి, సత్కరించారు. ఎంపీటీసీ గొర్లి చైతన్య, గండి దేముడు, బాదిరెడ్డి లక్ష్మణ, కొత్తూరు గెడ్డప్ప, ఎస్టీడీ సత్యనారాయణ, బర్ల రమణ, లెక్కల అప్పలనాయుడు, మారుడిపూడి అక్కుబాబు తదితరులు తదితరులు పాల్గొన్నారు.



సురేంద్రకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కశింకోట కూటమి నేతలు

కొత్తూరు : రాష్ట్ర గవర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మళ్ల సురేంద్రకు అనకాపల్లి, కశింకోట టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం సురేంద్ర స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీను, టీడీపీ నాయకులు నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, కర్రి దుర్గనాయుడు, మందపల్లి శివ, కోన రమణ, జనసేన నాయకులు కోన సత్తిబాబు, భీముని మోహన్, నారిపల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో మరిడిమాంబ విగ్రహం ప్రతిష్ఠ



పీలా గోవింద తదితరులకు అమ్మవారి చిత్రపటాలు బహూకరణ

కశింకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సుందరయ్యపేట పంచాయతీ ఆనందపురంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయాన్ని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, కూటమి నాయకులు కాయల మురళీ, గొంతిన శ్రీనివాసరావు, కర్రి సత్యనారాయణ, నిమ్మదల సన్యాసినాయుడు, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, రెడ్డి సూరిబాబు, రేఖా రామకృష్ణ, సూరిబాబు, నైనంశెట్టి రమణారావు, కర్రి దుర్గినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురంలో కాలువ నిర్మాణం ప్రారంభం

కొత్తూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పిసినికాడ పంచాయతీ రామభద్రపురం కాలనీలో కాలువ నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. కూటమి నాయకులు మళ్ళ శ్రీనివాసరావు, పంతులు శ్రీను, పొలమరశెట్టి నూకరాజు, దొడ్డి వెంకట్రావు, బుద్ద సోమేశ్వరరావు, పెద్దిశెట్టి దుర్గ, కాండ్రేగుల పరమేశ్వరరావు ఈ పనులను ప్రారంభించారు. ఎట్టకేలకు కాలనీలో అభివృద్ధి పనులు చేపడుతుండడంతో అక్కడివారంతా ఆనందం వ్యక్తం చేశారు.

రేషన్ దుకాణాల్లో నిత్యావసరాలు అందించాలి

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా సీపీఎం నాయకులు ప్రభుత్వ విధానాలపై ఆదివారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. అధిక ధరలు, నిరుద్యోగం, దళితులపై అత్యాచారాలు, జమిలీ ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆర్టీసీ కాంప్లెక్స్, నెహ్రూచౌక్ ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ప్రతినిధి కె.ఈశ్వరరావు మాట్లాడుతూ నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరకులను సరసమైన ధరలకు అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమంటూనే ట్రూ అప్ ద్వారా చార్జీల పేరుతో రూ. 20వేల కోట్లు ప్రజలపై భారాన్ని వేయడాన్ని ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండి నాయనబాబు, అల్లు రాజు, ఎస్.నాగరమణ, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా సిద్ధం

సబ్బవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నందున మండ లంలోని 23 సాగునీటి చెరువులకు సంబంధించి 138 టెరిటోరియల్ కాన్స్టిట్యుయెన్సీల ఓటరు జాబితాలు సర్వే నెంబర్లు, విస్తీర్ణం, ఆయకట్టు రైతుల వివరాలతో కూడిన జాబితాలను సిద్ధం చేశామని తహసీల్దార్ చిన్నికృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయా సచివాలయాల వద్ద ఆదివారం ప్రదర్శించినట్టు చెప్పారు. జాబితాలను సరి చూసుకొని అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లోగా తెలియజేయాల్సిందిగా ఆయన కోరారు.

ఉద్యోగులంతా అంకితభావంతో పనిచేయాలి

- ఎన్టీపీసీ రీజనల్ ఈడీ కేదార్ రంజన్ పాండు



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు



పాటలతో హుషారెక్కిస్తున్న గాయకుడు శ్రీరామచంద్ర

పరవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులంతా అంకితభావంతో పని చేసి సంస్థకు మంచిపేరు తీసుకురావాలని ఎన్టీపీసీ సౌత్ రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు సూచించారు. ఈడీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తొలిసారిగా సింహాద్రి ఎన్టీపీసీని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రక్రియ ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆయన ప్లాంట్‌లోని అన్ని విభాగాలను సందర్శించారు. కంట్రోల్ రూమ్, వీహెచ్‌పీ, ఎఫ్‌జీడీ కార్యకలాపాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక జీవనరేఖ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సృజనం చైల్డ్ డెవలప్‌మెంట్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న కార్యకలాపాలు గురించి అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం ఆయన దీపాంజలినగర్‌లో మొక్కలు నాటారు. తొలుత ఆయనకు సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా ఘన స్వాగతం పలికారు. అలాగే యూనియన్ ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్‌ఈడీని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఎన్టీపీసీ సాధనా క్రీడా మైదానంలో శనివారం రాత్రి ఎన్టీపీసీ రైజింగ్ డే గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ ఏర్పాటై యాభై సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అందరినీ అలరించాయి. తొలుత వేడుకలను సంస్థ రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశ విద్యుత్ రంగంలో ఎన్టీపీసీ 50 సంవత్సరాల ప్రయాణం గురించి వివరించారు. ఈ సందర్భంగా గాయకుడు, నటుడు శ్రీరామచంద్ర ఆలపించిన హిందీ, తెలుగు పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నర్సింగబిల్లి పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి



నర్సింగబిల్లి జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కశింకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగబిల్లి జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1998- 1999 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా ఓచోట కలవడంతో వారి ఆనందాలకు అవధులు లేవు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగబిల్లి, గొబ్బూరు, నూతనగుంటపాలెం, నల్లమారమ్మ గుడి, సోమవరం గ్రామాలకు చెందిన స్నేహితులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి టాలెంట్ టెస్టులతో మేలు



అనకాపల్లిలో టాలెంట్ టెస్టుకు హాజరైన అభ్యర్థులు

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి టాలెంట్ టెస్టులు మార్గదర్శిగా నిలుస్తాయని గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. ఇక్కడి గౌరీ గ్రంథాలయంలో ఆదివారం శ్రీధర్ కాలేజ్ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ (సీసీఈ) ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌బీ, ఎన్టీపీసీ పోటీ పరీక్షలకు టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ, పేద యువత సంక్షేమం కోసం నిర్వహించిన ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు సదరు సంస్థ ఉచిత శిక్షణ ఇవ్వనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ సీసీఈ డైరెక్టర్ ఎ.అన్వేష్‌రెడ్డి, ప్రతినిధి కె.రమేష్, గౌరీ గ్రంథాలయ ప్రతినిధి కాండ్రేగుల అప్పారావు (కెప్టెన్) పాల్గొన్నారు. ఈ టాలెంట్ టెస్టుకు అనకాపల్లి, చోడవరం, ఎస్.రాయవరం, రావికమతం, రాంబిల్లి, అచ్యుతాపురం, కశింకోట, సబ్బవరం, చీడికాడ, ఎలమంచిలి మండలాల నుంచి వందమందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.

41 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కశింకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి గ్రామం మీదుగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని స్టేషన్ రైటర్ సూర్యారావు తెలిపారు. ఆదివారం అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి మాటువేశామన్నారు. తాళ్లపాలెంలో ఉన్న వైన్ షాపు నుంచి 30 మద్యం క్వార్టర్ బాటిళ్లు కొనుగోలు చేసి గ్రామానికి తరలిస్తుండగా, కొత్తపల్లి గ్రామానికి చెందిన సుంకరి నాగేశ్వరరావు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనకాపల్లి టౌన్ : తుమ్మపాలలోని కొత్తపేట వీధిలో షేక్ హుస్సేన్‌బీ అనే మహిళ నుంచి 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు.


బొర్రా- కోనాపురం వెళ్లే రహదారి దుస్థితి


కోనాపురం గ్రామ సమీపంలో కోతకు గురైన రోడ్డు


ఇటీవల వర్షాలకు బీటలువారిన రహదారి

గిరిజనులకు ప్రయాణ కష్టాలు

» అధ్వాన స్థితిలో బొర్రా- కోనాపురం రహదారి

» ఈ మార్గంలోని గ్రామాల ప్రజల రాకపోకలకు యాతన

అనంతగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వాలు మారుమూల గ్రామాలను కలుపుకుంటూ పలు రోడ్ల నిర్మించినా, వాటి నిర్వహణ లేకపోవడం ఆ రహదారులన్నీ ప్రస్తుతం అధ్వానంగా మారాయి.. రూ. కోట్లతో నిర్మించి, అనంతరం నిర్వహణపై కనీసం దృష్టిపెట్టకపోవడంతో నెలల వ్యవధిలోనే కోతకు లోనై ప్రయాణికులకు కష్టాలను మిగుల్చుతున్నాయి. మండలంలోని బొర్రా- కోనాపురం రోడ్డు ఇందుకు ఓ ఉదాహరణగా నిలుస్తుంది. సుమారు పదిహేడేళ్ల క్రితం గిరిజన సంక్షేమశాఖ నిధులతో అనంతగిరి, అరకులోయ మండలాలను కలుపుకుంటూ బొర్రా నుంచి కోనాపురం మీదుగా లోతేరు, గన్నెల, ఇరగాయి తదితర పంచాయతీలను కలుపుకుంటూ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే, అప్పటి నుంచి కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంపై రోడ్లంతా ఎక్కడికక్కడ గోతులమయంగా మారింది. మరికొన్నిచోట్ల రోడ్డంతా కొట్టుకుపోయి, ప్రయాణాలకు కనీసం వీలులేకుండగా మారింది. దీంతో నిత్యం ప్రయాణాలు సాగించే.. కితలింగి, కరాయిగుడ, బోందుగుడ తదితర సుమారు 20 గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్డును మరమ్మతులు చేపట్టాలని అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా, మరమ్మతులకు కనీసం పైసా నిధులు మంజూరు కాలేదు.

ఓ యువకుడు తమ గ్రామానికి వెళ్లేరోడ్డు ఎంత దారుణంగా ఉందో అని వీడియో చేసి సోషల్ మీడియాలో పెట్టి ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు కోనాపురం రోడ్డును పరిశీలించి, మరమ్మతులకు నిధులు మంజూరుచేసి, గిరిజనుల ప్రయాణ కష్టాలను తీర్చాలని సర్పంచ్ గుబాయి అప్పలమ్మ, చిలకలగెడ్డ ఎంపీటీసీ సభ్యుడు తెడబారికి మితుల కోరారు.

ద్విచక్ర వాహనం దగ్ధం


వంజంగి మేఘాల కొండపై దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

పాడేరురూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి మేఘాల కొండపై ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఆదివారం ఉదయం ఇద్దరు యువకులు బైక్‌పై మేఘాల కొండకు వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా వాహనం నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన యువకులు వాహనాన్ని విడిచి బయటపడ్డారు. ఈ ప్రమాదంలో వాహనం పూర్తిగా దగ్ధమైంది. అయితే వాహనం ఎవరిదనేది విషయం తెలియలేదు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని స్థానిక సీఐ దీనబంధు తెలిపారు.

జల్ జీవన్ పథకంలో ప్రతి ఇంటికీ తాగునీరు


శంకుస్థాపన చేస్తున్న సర్పంచి శారద

డుంబ్రిగుడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జల్ జీవన్ మిషన్ పథకంతో ప్రతి ఇంటికీ సరక్షితమైన తాగునీరు అందించనున్నట్టు అరకు పంచాయతీ సర్పంచి శారద తెలిపారు.పంచాయతీ పరిధి నేరేడువలస గ్రామానికి జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రావిటీ పథకం మంజూరైంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆమె నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారాగ్రామంలోని సుమారు 100 గృహాలకు నీటి సమస్య తీరనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ మహేష్, అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాంప్ ఏర్పాటు చేయాలి


ఎంపీ తనుజారాణికి వినతి పత్రమిస్తున్న గ్రంథాలయ అధికారి

చింతపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాంప్‌ను ఏర్పాటు చేయాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజారాణికి కోరినట్టు గ్రంథాలయం అధికారి జగ్గత్‌రాయ్ తెలిపారు. ఆదివారం ఎంపీని కలిసిన ఈమేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయం అధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఎక్కడా ఎన్‌సీసీ క్యాంప్ అందుబాటులోలేదన్నారు. చింతపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీలో భాగం కావాలని ఆసక్తి చూపుతున్నారన్నారు. ఎన్‌సీసీ క్యాంప్ ఏర్పాటుపై ఎంపీ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

కార్తీక మాసోత్సవాలు విజయవంతం చేయాలి

పాడేరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నేపథ్యంలో పాడేరులోని పురాతన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయంలో నిర్వహించున్న ప్రధాన ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు కోరారు. ఈ నెల 15వ తేదీ కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 8 గంటలకు దీపోత్సవం, జ్వాలాతోరణం, శివపార్వతుల పల్లకిసేవలో భాగంగా ఊరేగింపు, శాస్త్రీయ నృత్యప్రదర్శన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. 18వ తేదీ 3వ సోమవారం అయ్యప్ప స్వామి మాలదారుల ప్రత్యేక పూజలు, 24న త్రినాథస్వామి మేళా, 25 4వ సోమవారం మధ్యాహ్నం భారీ అన్నదానం, డిసెంబరు 1వ తేదీన కార్తీక అమావాస్య సహస్ర దీపారాధన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి



సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ చేస్తున్న 104 సిబ్బంది

పాడేరురూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో 16 ఏళ్లగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించి,వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.సూర్యనారాయణ, బి.రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. 104 ఉద్యోగులు ఆదివారం 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీవో 3, జీవో 151ల మేరకు అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న 104 సిబ్బందిని గత వైసీపీ ప్రభుత్వం అరబిందో ఫార్మా ఫౌండేషన్‌కు అప్పగించిందన్నారు. ఈస్థితిలో ఆందోళన చేస్తే ఉద్యోగులను ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్సెడ్ సర్వీసెస్ (ఏపీసీవోఎస్)లో విలీనం చేస్తామని హామీ ఇచ్చిన జగన్ ప్రభుత్వం దానిని నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సమస్యల సాధనకు విధులు ఆటంకంలేకుండా ఆదివారం అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ర్యాలీలు చేపట్టామన్నారు. ఇప్పటికే జీతాలు సక్రమంగా అందకపోవడంతో కుటుంబాలను ఇబ్బందుల మధ్య నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. మూడేళ్లగా బకాయిపడిన ఇంక్రిమెంట్లను యాజమాన్యం ఏరియర్స్ రూపంలో ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐలను చెల్లించాలని, వాహనాలకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్‌లు వెంటనే చేయించాలనే తదితర డిమాండ్లు నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ఎం.సునీల్‌కుమార్, బి.వరప్రసాద్, కె.పవన్‌కుమార్, ఎం.శ్రీనివాస్, ఎస్‌కే.నజీర్, కె.కృష్ణవేణి, రమేశ్‌పాత్రో, రాజ్‌కిశోర్, ఫణికుమారి, కృష్ణ, మహేశ్, నవీన్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ: జడ్పీ సీఈవో

గూడెంకొత్తవీధి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ నిధుల వ్యయంలో అక్రమాలపై పది రోజుల్లో విచారణ చేపట్టి కలెక్టర్‌కి నివేదిక అందజేస్తామని విశాఖపట్నం జడ్పీ సీఈవో నారాయణమూర్తి తెలిపారు. ఆదివారం మండల పరిషత్ నిధుల అక్రమాలపై పత్రికల్లో వచ్చిన కథనాలకు ఆయన స్పందించారు. ఈసందర్భంగా 2021 నుంచి 2024 వరకు జీకేవీధి మండల పరిషత్‌కి విడుదలైన 13, 14, 15 ఆర్థిక సంఘం నిధుల ఖర్చుపై సమగ్ర విచారణ చేపడతామన్నారు. విచారణలో అక్రమాలు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడిగా అప్పన్న


సెక్షన్ ఆఫీసర్ అప్పన్న

పాడేరురూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ పాడేరు డివిజన్ అధ్యక్షుడిగా ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ నోగిలి అప్పన్న ఎన్నికైనట్టు పాడేరు యూనిట్ సభ్యుడు ఆర్.లక్ష్మణ్ తెలిపారు. స్థానిక గిరిజన ఉద్యోగుల భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశం అనంతరం ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో డివిజన్ అధ్యక్షుడు నోగిలి అప్పన్న, ఉపాధ్యక్షుడిగా, ఎస్.చంటి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జె.బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా సుజన, జాయింట్ సెక్రటరీగా పి.రుక్మిణి, కోశాధికారిగా పలాసి అమణి కుమారితోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. అప్పన్న మాట్లాడుతూ తనను అధ్యక్షుడుగా ఎన్నుకున్నడీఆర్‌వో, యాప్ ఎస్‌వోలు, యాప్ బీవోలు, ఎబీవోలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

లోయలోకి దూసుకుపోయిన మినీ బస్సు, కారు

» పర్యాటకులకు తప్పిన ప్రమాదం

అనంతగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డులోని లోయలోకి కారు, మినీ బస్సు దూసుకుపోయిన ఘటనలో.. పర్యాటకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.. మన్యం అందాలను తిలకించి వచ్చి, తిరుగు ప్రయాణంలోని ఘాట్ రోడ్డులోని హెయిర్‌పిన్‌బెండ్- 1 సమీపంలోని మినీ బస్సు అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. అలాగే, హెయిర్‌పిన్‌బెండ్- 3 వద్ద కారు లోయలోకి వెళ్లింది. ఈ రెండు ప్రమాదాల్లో పర్యాటకులు స్వల్పగాయాలతో బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువు 30


కాఫీ బోర్డు సభ్యులు ఉమామహేశ్వరరావు

పాడేరురూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాఫీ తోటల రైతు కూలీల పిల్లల్లో విద్యనభ్యసిస్తున్నవారు ఈ నెల 30వ తేదీలోగా స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు చేసుకోవాలని కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు కురసా ఉమామహేశ్వరరావు తెలిపారు. కాఫీ రైతుల పిల్లలను విద్యారంగంలో ప్రోత్సహించేందుకు కాఫీ బోర్డు నుంచి ఉపకార వేతనాలు అందిస్తున్నారన్నారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ చదువుతున్న వారికి రూ. 5వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ. 7,500, పీజీ విద్యార్థులకు రూ. 15 వేలు, ఆపై విద్యను అభ్యసించేవారికి ఏడాదికి రూ. 20 వేలు చొప్పున కాఫీ బోర్డు ద్వారా అందిస్తున్నట్టు ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

దొన్నుదొరకు ఘనస్వాగతం


అనంతగిరిలో దొన్నుదొరకు పుష్పగుచ్ఛాలందిస్తున్న నాయకులు

అనంతగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా నియమితులై తొలిసారిగా మండలానికి వచ్చిన టీడీపీ నేత సివేరి దొన్నుదొరకు ఆదివారం నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మండల కేంద్రంలో మహిళలు హారతులిచ్చి, పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.బాబీ, పి.భీమన్న, శంకరరావు, జ్ఞానేశ్వరరావు, దయానిధి, గరువులు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మురళీ, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలు గంజాయికి దూరంగా ఉండాలి: సీఐ


కోరుకొండలో గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ వినోద్ బాబు

చింతపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు గంజాయి సాగు, రవాణకు దూరంగా ఉండాలని స్థానిక సీఐ ఎం. వినోద్ బాబు అన్నారు. ఆదివారం సీపీఐ మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బలపం పంచాయతీ కోరుకొండ పరిసర గ్రామాలను సందర్శించారు. గ్రామాల్లో స్థానిక గిరిజనులతో సీఐ మాట్లాడుతూ, గంజాయి వల్ల యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దేశంలో గంజాయి ఎక్కడ పట్టుబడినా దాని మూలాలు గిరిజన ప్రాంతం వైపు చూపిస్తున్నారన్నారు. గంజాయి వల్ల గిరిజన ప్రాంతానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. గంజాయితో పట్టుబడిన వ్యక్తుల ఆస్తులను సైతం జప్తు చేస్తామన్నారు. గిరిజనులు గంజాయి వ్యాపారులకు సహకరించరాదన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరం ఎస్సై జి. వీరబాబు, పోలీసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన: జడ్పీ చైర్‌పర్సన్


డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో మారుమూల గ్రామాల్లో మౌలిక కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంలో జడ్పీ నిధులు రూ.15లక్షల చేపడుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ గ్రామాన్ని సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. అనంతరం బాకుబెడ, దొరగూడ గ్రామాల్లో చైర్ పర్సన్ పర్యటించి ఆయా గ్రామాల్లో గిరిజనులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శ

ఇటీవల మత్స్యగెడ్డలో చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందిన సుజనకోట పంచాయతీ గొడుగులపుట్టుకు చెందిన సొంబ్రన్న కుటుంబాన్ని జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పరామర్శించారు. తమవంతు సహాయ సహకారం అందిస్తామని కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఎంపీపీ ఎ.సీతమ్మ, సర్పంచులు బాబూరావు, రమేష్, ఎంపీటీసీ సభ్యులు గణపతి, సుబ్బలక్ష్మి, కమల, వైసీపీ నేతలు జగబంధు, మూర్తి, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.


చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న అటవీశాఖ ఉద్యోగులు



పాడేరు, అరకులో అమరులకు నివాళులర్పిస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది

అమరులైన అటవీ ఉద్యోగుల సేవలు మరువలేం

» డీఎఫ్‌వో వెంకట నరసింహారావు

చింతపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అమరులైన అటవీ ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని స్థానిక డివిజనల్ ఫారెస్టు అధికారి (డీఎఫ్‌వో) వై. వెంకట నరసింహారావు అన్నారు. ఆదివారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని అటవీశాఖ ఉద్యోగులు మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. అనంతరం సబ్ డివిజన్ కార్యాలయంలో అమరుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ అటవీ సంపద సంరక్షణకు ఉద్యోగులు 24గంటలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. విధి నిర్వహణలో వన్యమృగాలు, స్మగ్లర్ల వల్ల పలువురు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ ఉద్యోగుల ఆశయసాధనకు ప్రతి ఒకరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎల్‌టీకే పాత్రుడు, బి. అప్పారావు, భార్గవ్ వర్మ, శివరంజని, డీఆర్‌వో వెంకట రాజు పాల్గొన్నారు.

పాడేరులో నివాళి..

పాడేరు: స్థానిక డివిజనల్ అటవీ అధికారి కార్యాలయంలో అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అటవీ అమరవీరులకు ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. అరకులోయ సబ్ డీఎఫ్‌వో ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో స్థానిక అటవీ రేంజ్ అధికారి వి.లావణ్య అటవీ అమరవీరుల దినోత్సవం ప్రత్యేకతను వివరించారు. ఈసందర్భంగా అడవుల సంరక్షణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ అమరుల చిత్రపటాలకు పూలు వేసి అందరూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయలో..

అరకులోయ: అరకులోయ అటవీరేంజ్ ఆఫీస్ (టి)లో ఆదివారం రేంజర్ పి.శ్రీనివాసరావు, సెక్షన్ అధికారులు, సిబ్బంది అటవీ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, అటవీ శాఖ ఉద్యోగులు పలు జాగ్రత్తలు పాటిస్తూ విధులను నిర్వర్తించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


1987-88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చింతపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో వీరంతా కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం మల్లవరం కాఫీ తోటల్లో ఆటా పాటలతో ఉల్లాసంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తీర్మానం చేశారు. చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు దు రియా హేమంత్ కుమార్, పాడేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రీ, నిర్వాహక కమిటీ సభ్యులు పడాల సత్తిబాబు, రామకృష్ణ, జోగిరాజు, గుంటుపల్లి రమేశ్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత


పిల్లలకు నగదు, దుస్తులు, ఆధార్‌కార్డులను అందిస్తున్న టీడీపీ మహిళా నేత సన్యాసమ్మ

ముంచంగిపుట్టు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మారు మూల కుమడ పంచాయతీసిర్లిమెట్ట గ్రామంలో ముగ్గురు అనాథ పిల్లలకు టీడీపీ పార్టీ అరకు పార్లమెంట్ మహిళ ఉపాధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ చేయూతనందించారు. ఆ పిల్లలకు ఆధార్ కార్డులు లేవని తెలుసుకున్న ఆమె తన సొంత ఖర్చుతో ఏర్పాటుచేసినవాహనంలో వారిని కేంద్రానికి తీసుకువెళ్లి ఆధార్ కార్డులు వచ్చే విధంగా చేశారు. ఆ కార్డులను ఆమె ఆదివారం ఆ ముగ్గురు పిల్లలకు అందించారు. అలాగే వారికి నగదుతోపాటు దుస్తులు, బియ్యం, నిత్యాసర సరకులను అందజేశారు. కొంత కాలంగా ఆమె ఈ చిన్నారులకు ప్రతీ నెలా నగదును బూసిపుట్టుకు చెందిన ఆదరణ సేవా ట్రస్ట్ ప్రతినిధుల ద్వారా అందజేస్తున్నారు. చిన్నారులను ఆదుకుంటున్న సన్యాసమ్మను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు డి.ఈశ్వరరావు, టి.సత్యారావు, బి.ఈశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు డి.తిరుపతి, కె.జలంధర్, వి.గణపతి, వి.ఆనంద్, కె.నీలకంఠం, టి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

తాజంగిలో మెగా వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

చింతపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి గ్రామ పంచాయతీలో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఆదివారం విజయవాడ సిద్ధార్థ ప్రభుత్వ ఆస్పత్రి ఆర్థోపెడిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ పి. ప్రవీణ కుమార్ పర్యవేక్షణలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు చెందిన వైద్యాధికారులు.. 450మంది గిరిజన రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈకార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ శెట్టి మోహన్‌రావు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరురూరల్, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పరిసర గ్రామాల భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన నుంచి వంజంగి, కొత్తపల్లి తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చిన వందలాది మంది అమ్మ వారి దర్శనానికి వచ్చారు. దీంతో ఆదివారం ఉదయం 6 గంటలకే ఆలయంలో రద్దీ నెలకొంది. మైదాన ప్రాంత భక్తులు అమ్మవారికి ఘటాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో భోజనాలు చేసి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ఆధ్యాత్మిక బృంద, ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుల్లి రామారావు, శివరాత్రి శ్రీనివాసకుమార్, ధన్నేటి పలాసి రాము, యూ.వి. రత్నం, బి..రమణ, కె.రాధాకృష్ణంనాయుడు, కొణతాల సతీశ్, వి.అమరావతి, జి.సూర్యప్రకాశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాము కాట్లతో ఇద్దరికి అస్వస్థత


ముంచంగిపుట్టు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధనలక్ష్మి

ముంచంగిపుట్టు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగురాయి పంచాయతీ గిద్దులపుట్టుకు చెందిన తమర్బ ధనలక్ష్మి(14) పాముకాటుతో అస్వస్థతకు గురైంది. గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం సాముల పంటకోత కోస్తున్నసమయంలో పాము కాటు వేసింది. హుటాహుటీన బాలికను కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనంలో స్థానికసీహెచ్‌సీకితీసుకువచ్చారు. వైద్యుడు సంతోష్ బాలికకు వైద్య సేవలందించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది.

సీలేరు, నవంబరు 10 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ఎ. ధారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామానికి చెందినచిలకల జాన్ అనే వ్యక్తి పాముతో అస్వస్థత పాలయ్యాడు. కాఫీ తోటలో పనిచేస్తుండగా ఆయన పాము కాటుకు గురయ్యాడు. తోటి కూలీలు వెంటనే అతనిని ఆర్వీనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించి చింతపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమయంగా ఉండడంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్య పరీక్షలను చేశారు. అనంతరం మెరుగైన వైద్య కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించి వైద్య సేవలను అందిస్తున్నారు.

అరకులోయలో సినిమా షూటింగ్‌ల సందడి


అరకులోయ సమీపంలో ట్రావలర్ సినిమాలో ఓ సన్నివేశం చిత్రీకరిస్తున్న దృశ్యం

అరకులోయ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సహజసిద్ధమైన అందాలకు నిలయమైన అరకులోయలో సినిమా షూటింగ్‌లు జోరుగా జరుగుతున్నాయి. అగ్రహీరో వెంకటేష్ సినిమా చిత్రీకరణ కొద్దిరోజులుగా సాగుతున్న విషయం తెలిసిందే. 'ట్రావలర్' పేరుతో మరో సినిమా షూటింగ్ సాగుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమా దర్శకుడు మోదెం శ్రీధర్ మాట్లాడుతూ, అరకులో ప్రకృతి అందాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. సినిమాలకు ఈ ప్రాంతం ఎంతో అనువుగా ఉందన్నారు. వారం రోజులపాటు అరకులోయ పరిసర ప్రాంతాల్లో ప్రకృతి అందాల మధ్య ఓ పాటతోపాటు కొన్ని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్టు వివరించారు. ఈ సినిమాను గుడివాడ టూరింగ్ టాకీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నామన్నారు. తానే చిత్ర రచయిత, దర్శకత్వం, నిర్మాతగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. నూతన హీరో సాత్విక్ నారాయణ్, హీరోయిన్ సుభాంగి పంత్‌లతో ఈ ట్రావలర్ సినిమా చేస్తున్నట్టు పేర్కొన్నారు. సస్పెన్స్, క్రైం థ్రిల్లర్ కథాంశంతో సాగుతుందన్నారు. అరకులోయలో ఓ పాటతోపాటు విలన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్టు వివరించారు. ఇక్కడ షూటింగ్ అనంతరం గోవా , లక్కవరం, సోమశీల ప్రాంతాల్లో షూటింగ్ చేస్తామన్నారు. తాను దర్శకత్వం వహించిన శివనాగిణి అనే సినిమా త్వరలో రిలీజ్ కానున్నట్టు శ్రీధర్ తెలిపారు.

గుట్టలుగా వ్యర్థాలు.. పట్టని అధికారులు



వాడపాడు సమీపాన వంతెన వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

- వాడపాడు-జంపెన మార్గంలో చెత్తాచెదారం
- వంతెన వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలు
- ఏటి ప్రవాహం వద్దే పారబోస్తున్న దుకాణదారులు
- కుళ్లిపోయి భరించలేని దుర్గంధం వెదజల్లుతున్న వైనం
- ప్రయాణికులు, శివాలయ భక్తులు పడరాని పాట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మాడుగుల రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపాడు-జంపెన గ్రామాల మధ్య వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. ఈ మార్గంలోని పెద్దేరు ఏటి ప్రవాహంపై నిర్మించిన వంతెన వద్ద చెత్తాచెదారం కుప్పలుగా పడివుంది. అవి కుళ్లి దుర్గంధం వెదజల్లడంతో అటుగా వెళ్లే ప్రయాణికులతో పాటు ఏటి ప్రవాహంలో స్నానాలు ఆచరించే వారు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకునే పాపానికి పోవడం లేదు.

వాడపాడు-జంపెన గ్రామాల మధ్య ఏటి ప్రవాహానికి దగ్గరగా వాడపాడు, ఘాట్‌రోడ్డు జంక్షన్‌లు ఉన్నాయి. పలు దుకాణాల్లోని వ్యర్థాలు, వాడేసిన పనికిరాని వస్తువులు, చెత్త చెదారాన్ని కొంత మంది గోనె సంచుల్లో తీసుకువచ్చి వంతెన దిగువన పడవేస్తున్నారు. ఏదైనా శుభకార్యాలు జరిగితే మిగిలిన వ్యర్థాలను కూడా ఇక్కడికి తీసుకువచ్చి పారబోస్తున్నారు. పంచాయతీలోని చెత్తను సేకరించే సిబ్బంది కూడా వ్యర్థాలను ఇక్కడకు తీసుకొచ్చి పడేస్తున్నారని తెలుస్తోంది. దీంతో ఈ ప్రదేశం వ్యర్థాలతో నిండిపోయి కంపుకొడుతున్నది.

శివ భక్తుల అగచాట్లు

వాడపాడు-జంపెన గ్రామాల మధ్యలోని వంతెన ప్రదేశంలో శివాలయం ఉంది. కార్తీక మాసంలో భక్తులు, మాలధారణ భక్తులు ఈ ఏటి ప్రవాహంలో స్నానాలు ఆచరించి శివాలయానికి వెళ్లి దర్శించుకుని పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలో వంతెన వద్ద దిగువన పారేసిన వ్యర్థాలు కుళ్లిపోయి కంపుకొట్టడం, కొన్ని వ్యర్థాలు ఏటి ప్రవాహంలో కలుస్తుండడంతో నీటి కాలుష్యం ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారు. ఇలా పారేసిన చెత్తాచెదారం, వ్యర్థాలకు నిప్పు కూడా పెడుతున్నారు. తప్పితే వాటిని ఇక్కడ పారేయకుండా చర్యలు తీసుకోలేకపోతున్నారు. వంతెన వద్ద నెలకొన్న పారిశుధ్య లోపంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ దుస్థితి పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోవడం లేదని వారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ చెత్తా చెదారాన్ని తొలగించాలని, పారిశుధ్య సమస్య లేకుండా తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, భక్తులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



వంతెన కింద ఏటి ప్రవాహంలోకి వెళ్లేలా పారేసిన చెత్తాచెదారం



అమ్మవారిని దర్శించుకుంటున్న పీవీజీ కుమార్

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

- అమ్మవారిని దర్శించుకున్న పీవీజీ కుమార్

మాడుగుల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పదవి వచ్చిన తరువాత పీవీజీ కుమార్ తొలిసారి సతీమణి సత్యవతితో కలసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమలను నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన ఆయనకు కమిటీ చైర్మన్ అప్పలరాజు, సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అద్దెపల్లి జగ్గారావు, ఉందూరు దేముడు, పట్టణ అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లెక్కల కాశిబాబు, నాయకులు పి.సూర్యనారాయణరాజు, మరువాడ ఈశ్వరరావు, శ్రీనాధ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమాంబ జాతర



రాయపరాజుపేటలో భూలోకమాంబ దర్శనానికి బారులు తీరిన భక్తులు

చోడవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట పంచాయతీలో ఆదివారం భూలోకమాంబ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించకున్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన రేలారే రేలా, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. సర్పంచ్ బొడ్డేడ రాము నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్ తదితరులు ఉత్సవం విజయవంతానికి ప్రత్యేకంగా కృషి చేశారు.

ధారమఠంలో పర్యాటకుల సందడి



జలపాతం సందర్శన తర్వాత స్వామివారి దర్శనానికి వెళ్తున్న పర్యాటకులు

గొలుగొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాతమల్లంపేట పంచాయతీ పరిధిలోని ధారమఠం జలపాతం, ఉమాదార మల్లేశ్వరిస్వామి ఆలయం ఆదివారం పర్యాటకులు, భక్తులతో కళకళలాడాయి. కొయ్యూరు, గొలుగొండ, నర్సీపట్నం, విశాఖపట్నం, తుని, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎత్తయిన కొండపై నుంచి జలజలపారే జలపాతంలో పర్యాటకులు స్నానాలు చేసి సమీపంలోని దారమల్లేశ్వరి, శివుడు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నసమరాధనలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. నర్సీపట్నం వాకర్స్ క్లబ్ సభ్యులు జెఎస్ఎస్.నాగేశ్వరావు, స్వామి, వరహాలనాయుడు, బాబ్జి తదితరులు పర్యాటకుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

మూడు దశాబ్దాలకు అపూర్వ కలయిక

ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాయపరాజుపేటలో భూలోకమాంబ దర్శనానికి బారులు తీరిన భక్తులు

చోడవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు 30 సంవత్సవాల తరువాత ఒక్క చోట కలుసుకున్నారు. 1992-94 ఇంటర్ మీడియట్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం చౌడువాడలో కలుసుకున్నారు. మూడు దశాబ్దాల తరువాత ఒక్కచోట చేరిన వీరంతా తమ చిన్ననాటి సరదాలు, సంతోషాలు, జ్ఞాపకాల ముచ్చట్లలో మునిగిపోయారు. ఈ సందర్భంగా నాటి కళాశాల ప్రిన్సిపాల్ కామిరెడ్డి అప్పారావు, అధ్యాపకులు శ్రీనివాసరావు, రామారావు, తిరుమలరావులను విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నేతలు వై.లోవరాజు, మూర్తి, దేవరపల్లి సత్య, సువర్చల, రేవతి, సరస్వతి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం... తల్లీబిడ్డ క్షేమం



108 వాహనంలో ప్రసవమైన సత్యవతి, బిడ్డతో సిబ్బంది

మాకవరపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.కోడూరు చెందిన గర్భిణి 108 వాహనంలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన ఎం.సత్యవతికి పురిటి నొప్పులు రావడంతో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు 108కి ఫోన్ చేశారు. సిబ్బంది హుటాహుటిన వచ్చి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో 108 సిబ్బంది మాకవరపాలెం పీహెచ్‌సీకి తరలించారు.

45 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు



మద్యం సీసాలతో పట్టుబడ్డ వ్యక్తితో పోలీసులు

రావికమతం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమ్మకానికి అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకున్నామని కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కొత్తకోట మెయిన్ రోడ్డులో తనిఖీలు నిర్వహించగా సదరు వ్యక్తి వద్ద 45 మద్యం సీసాలు పట్టుబడ్డాయని, అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు నమోదు చేశామని చెప్పారు.

అటవీ శాఖ అమర వీరులకు ఘన నివాళులు





చోడవరంలో అమరులకు నివాళులర్పిస్తున్న అటవీ శాఖ ఉద్యోగులు.. కృష్ణాదేవిపేటలో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

చోడవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అమరుల సంస్మరణ దినాన్ని ఆదివారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ రేంజి అధికారి వీవీ రవి వర్మ అటవీ అమరులకు నివాళులర్పించారు. అటవీ అమరుల త్యాగాలను, ధైర్యాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: విధి నిర్వహణలో అమరులైన అటవీ అధికారులు, సిబ్బంది ఆత్మకు శాంతి చేకూరాలని కృష్ణాదేవిపేట అటవీ శాఖ రేంజ్ అధికారి కె.శ్రీనివాసరావు కోరారు. రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని కృష్ణాదేవిపేట అటవీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డుపై ఆదివారం పలు నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాల వద్ద మౌనం పాటించి ఘనంగా నివాలర్పించారు. ఈ సందర్భంగా రేజంర్ కె.శ్రీనివాస్రావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు త్యాగంచేసిన అటవీ అధికారులను ప్రతి ఏటా గుర్తుంచుకోనేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వారు భౌతికంగా లేకపోయినా అందరి హృదయాల్లో చిరస్మణీయులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిప్యూటీ రేంజ్ అధికారి సత్యనారాయణ, గొలుగొండ సెక్షన్ అధికారి రమణ, సిబ్బంది లక్ష్మణరావు, సత్యనారాయణ, గోరేసు, గణపతి, బ్యేస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ కార్యక్రమాలు



బాలలు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న దృశ్యం

నాతవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వైజాగ్ ప్రసాద్ చిన్నారుల సమక్షంలో నిర్వహించిన మేజిక్ షో అందరినీ ఆనందపరచింది. అలాగే విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విద్యా వేత్త, సామాజిక కార్యకర్త బంగార్రాజు మాట్లాడుతూ చిన్నారుల సృజనను వెలికితీస్తే వారు అద్భుతం సృష్టిస్తారని పేర్కొన్నారు.హెల్పింగ్ హార్ట్స్ చేస్తున్న విద్యా కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందన్నారు. అలాగే దాత నరసింగమూర్తి సహకారంతో వందమంది చిన్నారులకు బ్యాగులు అందజేశారు. అలాగే స్పందన చైతన్య ఫౌండేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యా కేంద్రాల ఏర్పాటుకు సహకరిస్తామని సభ్యులు తెలిపారు. నాతవరం పాఠశాల ఆవరణలో ప్రముఖ వైద్యులు శివబాలాజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖాధికారి వై.రమ్య, ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు, ప్రాజెక్టు మేనేజర్ కె.త్రినాథ్, మాజీ ఎంపీపీ పి.కొండబాబు, ఫౌండర్ హరి, నాయకులు సౌమ్య, నాయుడు, గుప్తా పాల్గొన్నారు.



రోలుగుంట మెయిన్ పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైన సామగ్రి

అంగన్‌వాడీ కేంద్రంలో పేలిన గ్యాస్ సిలిండర్

- కాలిపోయి బూడిదైన సామగ్రి

రోలుగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రోలుగుంటలో మెయిన్ పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ సిలిండర్ పేలిపోయి అగ్ని ప్రమాదం జరిగింది. దీనిపై స్థానికులు, సిబ్బంది అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రోలుగుంట-2, 4, 5 అంగన్‌వాడీ కేంద్రాలను స్థానిక మెయిన్ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే శుక్రవారం విధులు ముగించుకుని తాళాలు వేసుకుని అంగన్‌వాడీ సిబ్బంది వచ్చేశారు. ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించి అంగన్‌వాడీ కేంద్రం గదిలో ఉన్న గ్యాస్ సిలిండర్‌కు మంటలు వ్యాపించి ఒక్కసారిగా భారీ శబ్దంతో గ్యాస్ బండ పేలిపోయింది. ఈ ప్రమాదంలో గది వెనుకభాగం కూలిపోయింది. గదిలో ఉన్న అంగన్‌వాడీ సరకులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. పాల ప్యాకెట్లు, గుడ్లు, రికార్డులు, వంట సమాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ సమయంలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసినా అప్పటికే నష్టం జరిగిపోయింది. ఆదివారం సెలవు దినం కావడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. ఈ సంఘటన స్థలాన్ని డీటీ శంకరరావు, ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ సందర్శించి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

వసతిగృహానికి సీలింగ్ ఫ్యాన్ల వితరణ

మాడుగుల రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కింతలి బీసీ బాలురు వసతిగృహానికి జనసేన యువకులు నాలుగు సీలింగ్ ఫ్యాన్లను ఆదివారం వితరణగా అందించారు. కింతలి ఆనుకుని ఉన్న కింతలి వల్లాపురం జనసేన యూత్ మైచర్ల అర్జున్, గణపతి నాయుడు, దామరౌతు అశోక్ ఆర్థిక సహకారంతో ఈ ఫ్యాన్లు వితరణ చేశారు. స్థానిక సర్పంచ్ మైచర్ల సన్యాశిరావు, జనసేన యువజన నాయకుడు రెడ్డి సాయి, స్థానిక నాయకులు భీమేశ్, అప్పన్న, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఫాన్యలు అందించిన యువకులను వారు అభినందించారు.



వసతిగృహానికి ఫ్యాన్లు అందిస్తున్న జనసేన నాయకులు

టీటీడీ బోర్డు సభ్యుడికి 'ఈర్లె' సత్కారం



భానుప్రకాశ్‌రెడ్డిని అభినందిస్తున్న శ్రీరామమూర్తి

చోడవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడుగా నియమితులైన బీజేపీ అధికార ప్రతినిధి కొత్తకోట భానుప్రకాశ్‌రెడ్డిని బీజేపీ అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి సత్కరించారు. తిరుపతిలో ఆదివారం భానుప్రకాశ్‌రెడ్డిని కలిసి అభినందించారు. భానుప్రకాశ్‌రెడ్డి టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమితులు కావడంపై ఈర్లె హర్షం వ్యక్తం చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం హయాంలో తిరుమల పవిత్రత మరింత పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటరు ప్రక్రియ పరిశీలించిన తహసీల్దార్



బీఎల్వోలకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగమ్మ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ పౌరునికి ఫారం-6 ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని బీఎల్వోలను ఆదేశించారు. అలాగే బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి, సర్వే ద్వారా ఓటరు నమోదు చేయాలని, అర్హులైన కొత్త ఓటర్ల పేరు వివరాలతో జాబితా తయారు చేసి వారందరూ నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. డెత్ కేసులకు సంబంధించి వివరాలు సేకరించి క్షేత్రస్థాయిలో తగిన విచారణ చేపట్టి జాబితా నుంచి తొలగింపుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాల ప్రదర్శన



మత్స్యపురం యర్ర చెరువు ఆయకట్టు ఓటర్ల జాబితాను చినపాచిల సచివాలయంలో అతికిస్తున్న దృశ్యం

రావికమతం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి మండలంలో 13 చెరువుల ఆయకట్టు దారుల ఓటర్ల జాబితాలను ఆయా గ్రామాల గ్రామ సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచామని తహసీల్దార్ బి.వెంకటరమణ ఆదివారం తెలిపారు. పెద్దేరు రిజర్వాయర్ కుడికాలువ(ఆర్ఎంసి) మరుపాక ఆయకట్టుదారుల ఓటర్ల జాబితాను మరుపాక గ్రామ సచివాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాబితాలో ఆయకట్టుదారుడై ఓటు నమోదు కాకపోయినా, అభ్యంతరాలు ఉన్నా, చేర్పులు, మార్పులు కావాల్సినా తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని ఆయన సూచించారు. మేడివాడ పెద్ద చెరువు, టి.అర్జాపురం తివ్వలగెడ్డ, కల్యాణపులోవ రిజర్వాయర్, ధర్మవరం కామునిగెడ్డ మినీ రిజర్వాయర్, కొత్తకోట ముంతమామిడి కట్టు, టి.అర్జాపురం యర్రా చెరువు, మత్స్యపురం యర్రా చెరువు, కొత్తకోట వరకట్టు, సంత కట్టు, అచ్చన్న కట్టు, పెద్దకట్టు, పెద్దేరు ఆర్ఎంసీ (కెబిపి అగ్రహారం) గుడ్డిప రాబందు కెనాల్, గుడ్డిప గొర్లగెడ్డ చెరువులకు సంబంధించిన ఓటర్ల జాబితాలను సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచినట్టు తహసీలాదర్ తెలిపారు.

ఆయుష్ ఆస్పత్రికి రూ.9 లక్షలు మంజూరు

నర్సీపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ ఆస్పత్రి పెండింగ్ పనులు పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ రూ.9 లక్షలు మంజూరు చేశారు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా అయ్యన్నపాత్రుడు చొరవ తీసుకొని ఏరియా ఆస్పత్రి స్థలంలో ఆయుష్ ఆస్పత్రి నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయించారు. అప్పట్లోనే 95 శాతం పనులు పూర్తి చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మిగిలిన పనులు గురించి పట్టించుకోలేదు. దీంతో భవనం పాడుబడింది. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి కలెక్టర్ సందర్శించినప్పుడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆయుష్ ఆస్పత్రి విషయం తెలిపారు. దీంతో ఆస్పత్రిలో పెండింగ్ పనులు పూర్తిచేయడానికి కలెక్టర్ ఈ నిధులు మంజూరు చేశారు.

సత్యసాయి మందిరాల్లో అఖండ భజనలు

కృష్ణాదేవిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేట, ఏఎల్.పురం గ్రామాల్లోని సత్యసాయి మందిరాల్లో భక్తులు అఖండ భజన కార్యక్రమాలు చేపట్టారు. భగవాన్ సత్యసాయి 99వ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం 6 నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా అఖండ భజన పిలుపు నేపథ్యంలో సత్యసాయి భజన మండలి, సవాదళ్, సేవా సమితి సభ్యుల అఖండ భజనలతో రామాలయాలు, సత్యసాయి మందిరాలు కళకళలాడాయి. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో జనసేనను బలోపేతం చేయాలి

నాతవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేయాలని నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య సూచించారు. మండలంలోని గొలుగొండపేట గ్రామంలో ఆదివారం జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. రానున్న రోజులలో జనసేన బలోపేతానికి కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నేత రాజాన వీరసూర్యచంద్ర, పార్టీ నర్సీపట్నం మున్సిపాలిటీ అధ్యక్షుడు అద్దెపల్లి గణేశ్, మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణ, యూత్ అధ్యక్షుడు మురళి, టీడీపీ నాయకులు బొడ్డు సత్యనారాయణ, మిరపల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబలం పూజ

మాడుగుల. నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శతకంపట్టు వద్ద అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలో శనివారం రాత్రి అంబలం పూజ ఘనంగా జరిగింది. సుబ్బారావు పండితుల వేదమంత్రాలతో ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 18 మెట్ల అయ్యప్ప స్వామి పడి పూజ చేశారు. భజన కార్యక్రమానికి అయ్యప్పలు, శివ స్వాములతో పాటు గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వార్డు కార్యదర్శి చేయూత

రోలుగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేట గ్రామానికి చెందిన వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు ఆదివారం చేయూతనందించారు. పిల్లలకు స్టీల్ గ్లాసులు, బౌల్స్ సొంత నిధులతో అందించారు. భవిష్యత్‌లో ఈ కేంద్రాలకు మరిన్ని సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

ఇంటర్ విద్యార్థికి టీడీపీ శ్రేణుల ఆర్థిక సాయం

రావికమతం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన ఓ ఇంటర్ విద్యార్థికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు రూ.20,500 ఆర్థిక సాయం అందించారు. అర్జాపురం పంచాయతీ శివారు చిలకవానిపాలెం గ్రామానికి చెందిన మచ్చా బాబులు, చిన్నమ్మలు మృతి చెందడంతో వారి కుమారుడు వినోద్‌కుమార్ ఒంటరయ్యాడు. అతని ఇంటర్ చదువు నిలిచిపోకుండా టీడీపీ శ్రేణులు సమకూర్చిన ఈ మొత్తాన్ని పార్టీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, సర్పంచ్ మడగల ఫాల్గుణతి అందజేశారు.

విదేశీ భాషలు... స్వదేశీ కొలువులు



- కనీస అర్హత ఇంటర్
- ఆరు నెలలు పాటు బోధన
- రూ. 10 వేలు ఫీజు.. వారానికి మూడు రోజులు తరగతులు
- మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

ఏయూలో గత కొన్నాళ్లుగా పలు విదేశీ భాషల కోర్సులు నిర్వహణ



ఏయూలో విదేశీ కోర్సులపై బోధిస్తున్న ప్రొఫెసర్

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యూనివర్సిటీలో పలు విదేశీ భాషలకు సంబంధించిన కోర్సులు నిర్వహిస్తున్నారు. గ్లోబలైజేషన్, డిజిటలైజేషన్ తరువాత ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో పలు సంస్థలు వ్యాపార కార్యకలాపాలను నిర్వహించాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో ఆయా దేశాల్లోని క్లైంట్స్‌తో మాట్లాడేందుకు అవసరమైన భాషా నిపుణులకు డిమాండ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా విదేశీ భాషలపై పట్టున్న వారికి భారీ వేతనాలతో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. ఈ డిమాండ్ దృష్ట్యా ఏయూలో వివిధ విదేశీ భాషలు నేర్చుకునేందుకు అనుగుణంగా కోర్సులు నిర్వహి స్తున్నారు. ఉద్యోగ అవకాశాలు వేగంగా లభిస్తున్న నాలుగు విదేశీ భాషలకు జూనియర్ డిప్లొమో కోర్సు లను అందిస్తున్నారు. ఈ కోర్సుల్లో విద్యార్థులు భారీ సంఖ్యలో చేరుతుండగా, వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.



ఇవీ కోర్సులు..

ఏయూలో గత 20 ఏళ్లుగా డిప్లొమో ఇన్ ఫ్రెంచ్ కోర్సు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులో చేరాలనుకునే వారు ఇంటర్ పూర్తి చేస్తే సరిపోతుంది. 40 సీట్లు ఉన్నాయి. పది వేలు రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నేరుగా వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయానికి వెళ్లి కోర్సులో చేరవచ్చు. ఏటా 40 సీట్లు కూడా ఫిల్ అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. అలాగే, డిప్లమో ఇన్ జర్మన్ కోర్సును నాలుగేళ్లగా నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులో చేరడానికి ఇంటర్ అర్హతగా నిర్ణయించారు. ఇందులోనూ 40 సీట్లు ఉన్నాయి. రూ. పది వేలు ఫీజుగా నిర్ణయించారు. నేరుగా ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చు. డిప్లమో ఇన్ స్పానిష్ కోర్సును నాలుగేళ్లగా నిర్వహిస్తున్నారు. ఆరు నెలల కాల వ్యవధి. పది వేలు ఫీజు. 40 సీట్లు. అలాగే డిప్లమో ఇన్ జపనీస్ కోర్సును ఎనిమిదేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. అయితే, గడిచిన నాలుగేళ్లగా అడ్మిషన్లు జరగడం లేదు. ఈ ఏడాది నుంచి మళ్లీ అడ్మిషన్లు ప్రారంభిస్తున్నారు. ఈ కోర్సులో కూడా 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పది వేల రూపాయలు ఫీజు. ఆరు నెలలపాటు శిక్షణ ఉంటుంది. నేరుగా ఫీజు చెల్లించి కోర్సులో చేరవచ్చు. ఏయూలోని ఫారెన్ లాంగ్వేజెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వ ర్యంలో ఈ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఆయా కోర్సుల్లో చేరిన వారికి వారంలో మూడు రోజులు తర గతులు ఉంటాయి. ఆయా రోజుల్లో రెండు గంటల పాటు పాఠాలు బోధిస్తారు. సాయంత్రం 5.30 తరగ తులు ప్రారంభమవుతాయి. ఈ కోర్సుల నిర్వహణకు వర్సిటీ అధికారులు నిపుణులను నియమించారు.

ఉద్యోగ అవకాశాలు

ఈ కోర్సులు పూర్తి చేసి ఆయా భాషలపై పట్టు కలిగిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లభి స్తున్నాయి. కంటెంట్ డెవలపర్స్, ట్రాన్స్‌లేటర్స్, ఆయా దేశాలతో వ్యాపారాలు నడిపే సంస్థల్లో వీరికి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. వేతనాలు కూడా భారీగానే ఉంటున్నాయి. ఇకపోతే, ఈ కోర్సుల్లో చేరుతున్న వారిలో విద్యార్థులతో పాటు వివిధ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, మహిళలు కూడా ఉన్నారు. ఇప్పటికే పలు ఐటీ, ఇతర కంపెనీల్లో పనిచేస్తూ ఆయా భాషలకు ఉన్న డిమాండ్‌ను తెలుసుకుని చేరుతున్న వారి సంఖ్య అధికంగానే ఉంటున్నట్టు చెబుతున్నారు.

విదేశీ భాషలతో మెరుగైన ఉపాధి

- ప్రొఫెసర్ జి. శశిభూషణరావు, ఏయూ వీసీ



ప్రస్తుతం భిన్నమైన భాషల్లో నైపుణ్యం కలిగిన వారికి మంచి ఉద్యోగ, ఉపాధి అవ కాశాలు లభిస్తు న్నాయి. కొన్ని భాషలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని డిప్లమో కోర్సులు నిర్వహిస్తున్నాం. ఈ కోర్సుల్లో చేరడం వల్ల విద్యార్థుల్లో అంతర్జాతీయ దృక్పథం కలుగడంతో పాటు బహుళజాతి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. ఈ భాషలతో విద్యార్థులకు ఆయా ఆయా దేశాల సంస్కృతి, ఆచార వ్యవహారాలను తెలుసుకునే అవకాశం కలుగుతుంది. వర్సిటీలో నిర్వ హిస్తున్న కోర్సులకు మంచి ఆదరణ లభిస్తోంది. డిమాండ్ ఉన్న మరిన్ని భాషలను రానున్న రోజుల్లో కోర్సులు కింద తీసుకువస్తాం.

కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మోక్షం!

రెండేళ్ల కిందట నోటిఫికేషన్ విడుదల

- గత ఏడాది ఫిబ్రవరిలో ప్రిలిమ్స్
- మార్చిలో శారీరక, దేహదారుఢ్య పరీక్షలకు షెడ్యూల్
- ఎమ్మెల్సీ ఎన్నికల నెపంతో తప్పించుకున్న వైసీపీ సర్కారు
- తదుపరి ప్రక్రియకు సిద్ధమైన కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి విశాఖలో పదివేల మందికి ఊరట



విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా పెండింగ్‌లో ఉండిపోయిన కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియకు కదలిక వచ్చింది. వైసీపీ హయాం లో ఖాళీలను భర్తీ చేసేందుకు 2022 నవంబరులో నోటిఫికేష న్ విడుదల చేశారు. గత ఏడాది జనవరిలో ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించారు. మార్చిలో శారీరక, దేహదారుఢ్య పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేశారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నిక లు, కోర్టు కేసులను బూచిగా చూపించిన వైసీపీ ప్రభుత్వం తదుపరి ప్రక్రియను పక్కన పెట్టేసింది. ఈ సమస్యను గుర్తించిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రక్రియను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తాజాగా ప్రకటన విడుదలైంది.

రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్‌శాఖలో ఖాళీగా ఉన్న 6,100 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో 4,59,182 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలో 95,208 మంది అర్హత సాధించారు. అప్పటి నుంచి వీరంతా ఫిజికల్ టెస్ట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రిలిమ్స్ అర్హత సాధించిన సుమా రు పది వేల మందికిపైగా అభ్యర్థులున్నారు.

హామీని నిలబెట్టుకున్న చంద్రబాబు

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశ గా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు డిసెం బరు చివరి వారంలో ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి శారీరక, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహి స్తామని వెల్లడిం చింది. నిరీక్షణకు తెరదించేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారని అభ్యర్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా గ్రౌండ్ ప్రాక్టీస్ చేస్తూనే ఉన్నా మని, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రామకృష్ణ అనే అభ్యర్థి వాపోయాడు. ఎట్టకేలకు కల నెరవేరే సమయం దగ్గరపడిందని ఆనందం వ్యక్తం చేశాడు. కాగా ఫిజికల్ టెస్ట్‌లో క్వాలిఫై అయిన వారికి మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి ఉద్యోగాలు దక్కనున్నాయి. తాజా నోటిఫికేషన్‌లో భాగంగా విశాఖ సిటీ పరిధిలో 187, గ్రామీణ జిల్లా పరిధిలో 159 సివిల్ కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

నిరీక్షణకు తెరపడింది



రెండేళ్లుగా పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్నాం. గత ప్రభుత్వం నోటిపికేషన్ ఇచ్చి ప్రక్రియను పూర్తి చేయలేక పోయింది. దీంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతిరోజూ గ్రౌండ్ ప్రాక్టీస్ చేయాల్సి వస్తోంది. ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం తదుపరి ప్రక్రియకు చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉంది. వీలైనంత వేగంగా మిగిలిన ప్రక్రియను పూర్తి చేస్తే వేలాది మందికి మేలు చేసినట్టు అవుతుంది.

- వి.గౌరినాయుడు, అభ్యర్థి

నూకాంబికను దర్శించుకున్న జెన్‌కో ఎండీ



జెన్‌కో ఎండీకి అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని ఆదివారం జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆర్డీవో షేక్ ఆయిషా, తహసీల్దార్ విజయ్‌కుమార్, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం బాలాలయంలోని అమ్మవారికి ఎండీ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పండుగ చేసి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ మండపంలో ఎండీకి అర్చకులు సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

అమ్మవారి సేవలో డీఎస్పీ శ్రావణి దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న డీఎస్పీ దంపతులు

నూకాంబికను అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి దంపతులు దర్శించుకున్నారు. తొలుత వీరికి నిర్వాహకులు స్వాగతం పలికారు. బాలాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు డీఎస్పీ దంపతులను సత్కరించి, చిత్రపటాన్ని అందజేశారు.

అటవీ అమరవీరులకు అంజలి



అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎఫ్‌వో గంపా లక్ష్మణ్

అనకాపల్లి, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని సామాజిక వన విభాగం, డివిజనల్ ఫారెస్ట్ అధికారి కార్యాలయంలో ఆదివారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. డివిజనల్ ఫారెస్ట్ అధికారి గంపా లక్ష్మణ్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1939 నుంచి నేటి వరకు ఎంతో మంది అటవీ అధికారులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అమరులై భావితరాలకు ఆదర్శప్రాయులయ్యారన్నారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అంకితభావం చూపేవారికి తగిన ఉంటుందన్నారు. డివిజనల్ పరిధిలోని నాలుగు రేంజ్‌ల అధికారులు, సెక్షన్ ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ విజేతలు విశాఖ, కడప

- నక్కపల్లిలో ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు
- జాతీయ పోటీలకు బాలురు, బాలికల జట్లు ఎంపిక



జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు



ఎంపికైన బాలుర జట్టు

నక్కపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్- 14 బాల, బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నక్కపల్లిలో మూడు రోజుల పాటు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఫైనల్స్ పోరులో బాలుర విభాగంలో విశాఖ జిల్లా, బాలికల విభాగంలో కడప జిల్లా జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖ జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించగా, చిత్తూరు జిల్లా జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. బాలుర విభాగంలో ద్వితీయ స్థానం కడప, తృతీయ స్థానం చిత్తూరు జిల్లా జట్లు దక్కించుకున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, నక్కల్లి బీఎస్ హాకీ క్లబ్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఇదిలావుంటే, ఈ టోర్నమెంట్‌లో పదమూడు జిల్లాల నుంచి సుమారు 360మంది బాల,బాలికలు తలపడ్డారు. అత్యుత్తమ ఆట తీరును కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయికి అర్హత సాధించారు. వీరు డిసెంబరు ఎనిమిదో తేదీ నుంచి 13 వరకు మధ్యప్రదేశ్‌లోని మాంటిస్సోరి గ్రామంలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొననున్నారని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు.

బాలుర విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైనవారు..

బాలుర విభాగంలో జాతీయ పోటీలకు ఎంపికైన వారిలో కొల్నాటి శివసూర్య మణికంఠ (కడప), ఎం.సంజయ్ (కడప), డి,చేతన్ ప్రతిష్ (కడప), ఎస్.ఉమా ఫరూక్ (చిత్తూరు), ఆకేటి దేవేందర్ వెంకట్ (విశాఖ), కొల్నాటి నాగ తరుణ్ (విశాఖ), మనబాల దిలీప్ కుమార్ (విశాఖ), కశింకోట పవన్ కుమార్ (విశాఖ), కె.యువ చైతన్యరెడ్డి (చిత్తూరు), షేక్ మునీర్ (చిత్తూరు), జి.భవానీ ప్రసాద్ (తూ.గో), జీఎన్ఎస్‌వీపీ సత్యనారాయణ (తూ.గో.), వేముల విక్టర్ పాల్ (గుంటూరు), ఎం.నరేంద్ర (ప్రకాశం), జి.గణేశ్ (నెల్లూరు);జి.సాత్విక్ (అనంతపురం),చింతపల్లి లోకేశ్ (విజయనగరం),వి.ధర్మేంద్ర ప్రేమ్ రాజ బహదూర్ (పశ్చిమగోదావరి) ఉన్నారు.

బాలికల విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైనవారు

బాలికల విభాగానికి సంబంధించి కడప జిల్లాకు చెందిన ఎం.దీక్షా మాధురి, తిరుమలశెట్టి జ్యోత్స్న, కోయలకుంట శ్రీనిధి రాయల్, విశాఖ జిల్లాకు చెందిన రెడ్డి చైతన్యశ్రీ, కొనకళ్ల శ్రావ్య, కొర్రా జ్యోతి, చెవ్వాకుల శ్రీజ, చిత్తూరుకు చెందిన ఆరిపల్లి మహాలక్ష్మి, కె.రేఖ, కె.నవనీత, షేక్ ఫరానా (కర్నూలు), పి.మహాలక్ష్మి (తూ.గో), బొబ్బిలి పల్లవి (కృష్ణా), తెనాలి వేద వైష్ణవిరెడ్డి (గుంటూరు), ఎస్.పూజ (విజయనగరం), ఆకుల లోహిత (ప్రకాశం), ఎ.రక్షిత (నెల్లూరు), జి.వెంకట రుషికా రెడ్డి (వైఎస్ఆర్ కడప) ఉన్నారు.

మధ్యాహ్న భోజనానికి సరికొత్త మెనూ!

... 5వ పేజీ తరువాయి

వైట్‌రైస్‌తో కూరలు తినడాన్ని ఇష్టపడతారని వంట ఏజెన్సీలు సూచించాయి. దీంతో ప్రాంతాలవారీగా భోజనం అందించాలని మంత్రి ఆదేశించారు.

ఉత్తరాంధ్రకు ఒకటే మెనూ

ఇందులో భాగంగా ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు రూపొందించిన ఒకే విధమైన మెనూ రూపొందించారు. దీనిని ఈనెల 14 నుంచి అమలుచేయాలని ప్రతిపాదించారు. అదేరోజు మెగా టీచర్, పేరెంట్స్ సమావేశానికి సన్నాహాలు చేశారు. కానీ ఈ సమావేశం వచ్చేనెలకు వాయిదా పడిది. ఈ నేపథ్యంలో కొత్త మెనూ ఎప్పుడు అమల్లోకి వచ్చేదీ త్వరలో చెబుతామని విద్యాశాఖ వెల్లడించింది. కాగా కొత మెనూ ఉత్తరాంధ్ర ప్రజల అలవాట్లకు అనుగుణంగా ఉందని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమంది పైడిరాజు అన్నారు. గత ప్రభుత్వంలో అమలుచేసిన మెనూను చాలామంది విద్యార్థులు ఇష్టపడలేదన్నారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు.

ఇదిలావుండగా కొత్త మెనూలో రసం బదులు పప్పు అందిస్తే పోషక విలువలతో కూడిత భోజనం అందుతుందన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఈ మార్పు చేయాలని కోరారు.

గృహ నిర్మాణ శాఖ నిర్వీర్యం

... 5వ పేజీ తరువాయి

అవుట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు కూడా లేకపోవడంతో, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో బిల్లులు సరిగా చెల్లించక అసంపూర్తిగా వున్న ఇళ్లను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే సిబ్బంది కొరతతోపాటు ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గృహ నిర్మాణ శాఖ.. ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని ఎలా అధిగమిస్తుందో వేచి చూడాలి.

సొంత గూడు కూడా దుస్థితి

గృహ నిర్మాణ శాఖకు సిబ్బంది కొరత ఒక సమస్య అయితే, కొన్నిచోట్ల కనీసం సొంతగూడు కూడా లేదు. చోడవరంలోని భవనం కొద్దిపాటి వర్షానికి కూడా కారిపోతుండడంతో నరసయ్యపేట పంచాయతీ కార్యాలయ భవనంలోకి తరలించారు. చోడవరం డీఈ కార్యాలయం అద్దె భవనంలో నడుస్తున్నది. ఈ రెండు కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో లబ్ధిదారులకు కూడా తెలియని పరిస్థితి. ఇతర మండలాల్లో సైతం గృహ నిర్మాణ శాఖకు వసతి కొరత వుంది.

ఆధునాతనంగా అనకాపల్లి రైల్వే స్టేషన్

... 5వ పేజీ తరువాయి

డీఈఎన్ గౌతమ్, ఏడీఈఎన్ కృష్ణయ్య, స్టేషన్ సూపరింటెండెంట్ రామకృష్ణ, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌ల, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు ఎం.నీల బాబు, పొన్నగంటి అప్పారావు, రామకృష్ణ, శ్రీను, తదితరులు ఉన్నారు.



రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ రమేశ్

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి రైల్వేస్టేషన్‌కు సమీపంలోని శంకరం పై ఓవర్ వంతెన వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి తెలిపారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్టు ఆదివారం సమాచారం అందిందన్నారు. ఈ మేరకు విచారణ చేపట్టగా మృతుని వయస్సు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని, 5.7 అడుగుల ఎత్తు, చామచాయ రంగులో ఉన్నాడని వివరించారు. అలాగే, మృతుడు నలుపు రంగు స్వెట్టర్, నల్లరంగు ప్యాంటు ధరించి ఉన్నట్టు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లోయలోకి దూసుకుపోయిన ఆటో

- ఒకరి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు

పెదబయలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పెదబయలు నుంచి ఆదివారం ప్రయాణికులతో వెళ తున్న ఓ ఆటో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయి భారీ వృక్షాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెదబయలు నుంచి ఆదివారం మధ్యాహ్నం ప్రయాణికులతో ఓ ఆటో లక్ష్మీపేటకు బయలుదేరింది. కప్పడా ఘాటీ వద్దకు వచ్చే సరికి అదుపు తప్పి లోయలోకి దూసుకువెళ్లి భారీ వృక్షాన్ని ఢీకొంది. ఆటోలో ఉన్న పది మంది ప్రయాణికుల్లో ఒకరైన లక్ష్మీపేట పంచాయతీ కిలుములు గ్రామానికి చెందిన కిల్లో వాలసయ్య(56) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. క్షతగాత్రులను స్థానికులు ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో వి.పార్వతమ్మ, వి.కార్తీక్‌కు తీవ్ర గాయాలు కావడంతో వారిని విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1,800 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



పెందుర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవలో ఓ ఇంట్లో అక్ర మంగా నిల్వ ఉంచిన 1,800 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసేందుకు నిల్వ చేశారన్న సమాచారం మేరకు ఆదివారం పెందుర్తి పోలీసులు దాడులు చేసి సబ్బవరానికి చెందిన కూన గోవిందరావు ఇక్కడ ఈ బియ్యాన్ని ఉంచినట్టు గుర్తించి సీజ్ చేశామని సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని దళారీల ద్వారా కొనుగోలు చేసి స్టాక్ పాయింట్లో నిల్వ చేస్తుంటారన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎంఎల్‌సీ పాయింట్‌కి తరలించి, కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

ప్రతి పనికీ ఓ రేటు!

... 5వ పేజీ తరువాయి

పుస్తకం జారీ చేయాలన్నా ఎకరాకు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి సచివాలయంలో సర్వేయర్లు ఉన్నప్పటికీ లైసెన్సుడు ప్రైవేటు సర్వేయర్లు ఇక్కడ భూములు సర్వే చేయడం గమనార్హం. సాగునీటి బోర్లు వేయించు కోవడానికి, టేకు చెట్లు నరికివేత అనుమతులకు (వాల్టా చట్టం కింద) అందే దరఖాస్తులు ప్రైవేటు సర్వేయర్ల ద్వారా 'క్లియర్' చేస్తుంటారని రైతులు వాపోతున్నారు. జగనన్న కాలనీల్లో ఎల్‌పీసీల పేరుమీద భారీ దందా నడిచింది. సెంటున్నర నుంచి ఐదు సెంట్లు వరకు ఎల్‌పీసీలు మంజూరు చేశారు. ఒక్కో ఎల్‌పీసీకి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేశారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554